శుక్రవారం
22-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 92
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కెనడా పౌరులకు భారత వీసాల నిలిపివేత

కెనడాకు భారత్ మరో షాక్ ఇచ్చింది. ఆ దేశ పౌరులకు భారత వీసాలను నిలిపివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య క్రమంలో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు దెబ్బతిన్న క్రమంలో తాజా పరిణామం చర్చనీయాంశంగా మారింది.

2 లో

అసెంబ్లీ ఉద్రిక్తం

చంద్రబాబు అరెస్టుపై దద్దరిల్లిన ఉభయ సభలు

- స్పీకర్ పోడియం చుట్టుముట్టి టీడీపీ సభ్యుల నిరసన
- మీసాలు మెలేస్తూ అంబటి రాంబాబు, బాలకృష్ణ సవాళ్లు
- ప్రతిపక్ష సభ్యులపై తొలిరోజే సస్పెన్షన్ వేటు
- పయ్యావుల, కోటంరెడ్డి, అనగానిపై సెషన్ మొత్తం...
- మండలిలోనూ కొనసాగిన నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై ఉభయసభలు దద్దరిల్లాయి. చంద్రబాబు అరెస్ట్‌పై ఇటు అసెంబ్లీలోనూ, అటు మండలిలోనూ టీడీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలు తిరస్కరణకు గురి కావడంతో సభ్యులు చర్చకు పట్టుపట్టారు. స్పీకర్ పోడియం చుట్టుముట్టి చంద్రబాబుపై తప్పుడు కేసు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. 'జగన్ ప్రైవేటు సైన్యంలా సీఐడీ, అరాచకాలకు అడ్డా ఏపీ, జగన్ రెడ్డి అరాచకాలపై ఆగదు మా పోరాటం, చంద్రబాబుపై కేసు ఎత్తివేయకుంటే ప్రజా ఉద్యమమే, స్కిల్‌పై ఆరోపణలన్నీ అవాస్తవాలే' వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులను సభ్యులు ప్రదర్శించారు. ప్రతిపక్ష సభ్యుల నిరసనల హోరు మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. సభ్యుల నిరసనలతో మంత్రి ఏమి చెపుతున్నారో అర్థం కాలేదు. సభలో గందరగోళం నెలకొనడంతో శాసనసభ వ్యవహారాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ సభ సజావుగా జరిగేలా సహకరించాలని ప్రతిపక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలకనుగుణంగా వస్తే చంద్రబాబు అరెస్ట్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాయిదా తీర్మానం తిరస్కరించిన తర్వాత చర్చకు పట్టుబట్టడం సరికాదన్నారు. టీడీపీ సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలు చేస్తూ స్పీకర్ చైర్‌ను చుట్టుముట్టి, కాగితాలు చింపి పైకి విసిరేశారు. బల్లలు చరుస్తూ ఆందోళనను మరింత తీవ్రం చేశారు. ఈలోగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తన రెచ్చగొట్టేలా ఉందని, వారిపై స్పీకర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సభ్యులకు

- మిగతా 2 లో

మా పోరాట ఫలితమే

మహిళా బిల్లుపై డి.రాజా

- ఇండియా కూటమి బలోపేతానికి కృషి
- ఉధంపూర్‌లో ఏఐఎస్ఎఫ్‌పై ఏబీవీపీ-ఆర్ఎస్ఎస్ దాడికి సీపీఐ ఖండన
- బాధ్యులపై చర్యలకు డిమాండ్

న్యూదిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు లోక్‌సభ ఆమోదంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హర్షం వ్యక్తం చేసింది. ఇది తమ పోరాట ఫలితమేనని తెలిపింది. గీతా ముఖర్జీ నేతృత్వ పార్లమెంటరీ సెలక్ట్ కమిటీ ద్వారా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ డిమాండ్ తొలిసారి తెరపైకొచ్చినట్లు గుర్తుచేసింది. 1963లో పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్ అంశాన్ని రేణు చక్రవర్తి లేవనెత్తారని తెలిపింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం రేణు చక్రవర్తి, గీతా ముఖర్జీ వంటి గొప్ప నాయకులు అందించిన తోడ్పాటు వల్ల ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు... చట్టరూపం దాల్చబోతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. పార్టీ కార్యదర్శులు కె.నారాయణ, అతుల్ కుమార్ అంజాన్‌తో కలిసి ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా బిల్లుకు సీపీఐ తరపున మద్దతు ప్రకటించారు. 2014 నుంచి పార్లమెంటులో మెజారిటీ ఉన్నప్పటికీ ఈ బిల్లు తీసుకు రావడానికి బీజేపీ ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందని వ్యాఖ్యానించారు. అనేక రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా మహిళా బిల్లు వెలుగు చూసిందన్నారు. 2026లో నిర్వహించే పునర్విభజన తర్వాతే రిజర్వేషన్లు అమలవుతాయి అంటే 2029కి ముందు జరిగే అవకాశం లేదని అన్నారు. రిజర్వేషన్ల కోసం ఓబీసీల డిమాండ్‌పై చర్చ జరగకపోవడం, దానిని కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరమన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అధ్యక్షతన ఈనెల 19, 20 తేదీల్లో దిల్లీలోని అజయ్‌భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గం జరిగిందని, సమావేశంలో ఇండియా కూటమి ఏర్పాటుతో పాటు రాజకీయ పరిణామాలను, వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కోసం పొత్తులు, అనుసరించే విధానం గురించి చర్చించినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో బీజేపీని గద్దె దించే లక్ష్యంతో ప్రతిపక్షాలన్నీ ఏకమై ఇండియా కూటమి బలోపేతానికి తమ వంతు కృషిచేస్తామని రాజా అన్నారు. కూటమి ఏర్పాటు చేసిన కమిటీల పనితీరు సజావుగా సాగేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. సమన్వయ కమిటీలో మరిన్ని పార్టీలకు స్థానం కల్పించడం సముచితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమి నాయకత్వమే కీలక నిర్ణయాలు తీసుకునేలా అవగాహన కుదిరిందని వెల్లడించారు. కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఇతర సామాజిక ఉద్యమాలను చైతన్యపరుస్తూ ఇండియా కూటమికి మరింత బలం పెంచేందుకు సీపీఐ కసరత్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈనెల 18న జమ్ముకశ్మీర్, ఉధంపూర్‌లో అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సదస్సు జరగనివ్వకుండా ఏబీవీపీ-ఆర్ఎస్ఎస్ దాడి చేయడాన్ని పార్టీ కార్యవర్గం ఖండించినట్లు రాజా చెప్పారు. పోలీసులు, పారామిలటరీ ప్రేక్షక పాత్ర వహించడాన్ని దుయ్యబట్టిందన్నారు. పోలీసుల సమక్షంలోనే ప్రతినిధులపై ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ మూకలు దాడి చేశాయని, ఏఐఎస్ఎఫ్ అఖిలభారత అధ్యక్షుడిని వదల్లేదని చెప్పారు. దేశ ద్రోహ చర్యల కారణంగా లెఫ్ట్ సంస్థల కార్యక్రమాలను అనుమతివ్వలేమని నిర్వాహకులతో పోలీసులు

- మిగతా 2 లో

కల సాకారం

- ఎట్టకేలకు చట్టం దిశగా మహిళా బిల్లు
- రాజ్యసభలో ఆమోదం
- పార్టీలకు అతీతంగా మద్దతిచ్చిన సభ్యులు
- ఓబీసీలు, ముస్లింలకు కోటా, తక్షణ అమలుకు డిమాండ్

న్యూదిల్లీ: దశాబ్దాల కల సాకారం అయింది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు రాజ్యసభ గురువారం ఆమోదం తెలిపింది. పార్టీలకు అతీతంగా సభ్యులు ఈ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు ఇక చట్టం కాబోతోంది. ఇప్పటికే లోక్‌సభలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్రతో దీనికి చట్టరూపం వస్తుంది. మహిళా బిల్లు ఆమోదం చారిత్రకమని అధికార బీజేపీ చెప్పుకోగా ఎన్నికల గిమ్మిక్కు అని విపక్షాలు దుయ్యబట్టాయి. ఇండియా కూటమి భయంతో పాటు ఎన్నికల్లో లబ్ధి కోసమే మహిళా బిల్లును మోదీ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించాయి. జనగణన,

- మిగతా 2 లో

మరో విద్యుత్ ఉద్యమం

- 27న జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- జగన్ సర్కారు దిగివచ్చే వరకూ ఆందోళనలు
- వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయాలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా 27న అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమానికి నాంది పలుకుతూ మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల అధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం రామకృష్ణ అధ్యక్షతన గురువారం బాలోత్సవ భవన్‌లో జరిగింది. ముందుగా రామకృష్ణ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంటు చార్జీలు ఏడుసార్లు పెంచి...ప్రజలపై రూ.50 వేల కోట్ల భారం వేశారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో

- మిగతా 2 లో

'పోర్టర్' రాహుల్‌గాంధీ

రైల్వే కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్న వైనం

న్యూదిల్లీ: భారత్ జోడో యాత్రలో భాగంగా వేర్వేరు రంగాల వారితో కలుస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాజాగా రైల్వే కూలీలను కలిశారు. అంతకుముందు లారీ డ్రైవర్లతో, బైక్ మెకానిక్‌లతో ముచ్చటించారు. వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. తాజాగా రైల్వే కూలీ అవతారమెత్తారు. మీలో ఒకడినంటూ పోర్టర్‌లతో మమేకమయ్యారు. ఎర్ర చొక్కా , బ్యాడ్జి ధరించి రైల్వే కూలీ వస్త్రధారణలో సూట్‌కేసు మోసారు. ఆయన చుట్టూ రైల్వే కూలీలు సందడి చేశారు. అనంతరం కూలీల మధ్య కూర్చొని వారి సమస్యలు, సాదకబాధకాలను రాహుల్ తెలుసుకున్నారు. ఇదంతా దిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్ వద్ద జరిగింది. దీని గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ పంచుకున్నారు. 'దిల్లీలోని ఆనంద్ విహార్ టెర్మినల్ వద్ద కూలీ సోదరులను కలిశా. చాలా కాలంగా ఈ పని చేయాలన్న ఆలోచన ఉంది. వాళ్లు కూడా చాలా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నా ప్రయోగాలతో నీకు పిచ్చెక్కినా నాకు సంబంధం లేదు.. నీకు ఇంటర్నేషనల్ సిలబస్ బోధిస్తాను!

ఆర్టీసీ ఉద్యోగుల ప్రమాద బీమా

రూ.కోటి పది లక్షలకు పెంపు

- ఏపీఎస్ఆర్టీసీ-ఎస్‌బీఐ అవగాహన ఒప్పందం
- మంత్రి పినెపే విశ్వరూప్ సమక్షంలో కీలక నిర్ణయం

2 లో

చంద్రబాబు సీఐడీ 'కస్టడీ' పిటిషన్‌పై

తీర్పు మళ్లీ వాయిదా



విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు సీఐడీ కస్టడీ పిటిషన్‌పై తీర్పును విజయవాడ ఏసీబీ కోర్టు మళ్లీ వాయిదా వేసింది. తొలుత గురువారం ఉదయం ప్రకటిస్తానని చెప్పిన న్యాయమూర్తి మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఆ తరువాత మరలా వాయిదా వేస్తూ శుక్రవారం ఉదయం 10.30గంటలకు నిర్ణయం వెలువరించనున్నట్టు తెలిపారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్ హైకోర్టులో ఉన్న దృష్ట్యా తీర్పు వాయిదా వేశారని సమాచారం. శుక్రవారం హైకోర్టులో క్వాష్ పిటిషన్ లిస్ట్ అయితే తీర్పు వాయిదా వేస్తామని, క్వాష్ పిటిషన్ లిస్ట్ కాకపోతే తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి తెలిపారు. చంద్రబాబును విచారించేందుకు 'పోలీసు కస్టడీ'కి ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు వాదించారు. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చాలని కోరారు. పోలీసు కస్టడీ పేరుతో విచారణ చేసి, ఆ వివరాలను ఎంపిక చేసుకున్న ఛానళ్ల ద్వారా ప్రచారం చేసి ప్రజల్లో చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయాలనే లక్ష్యంతో దర్యాప్తు సంస్థ వ్యవహరిస్తోందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సీఐడీ తరఫున అదనపు

- మిగతా 2 లో

చంద్రబాబును జైల్లో చంపేందుకు కుట్ర

అందుకే అరెస్ట్ చేశారని అనుమానంగా ఉంది

రిమాండ్ ఖైదీ మృతితో నారా లోకేశ్ ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో‌- అమరావతి : రాజమహేంద్రవరం జైల్లో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏం జరిగినా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే బాధ్యతని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. జైలులో అంతం చేసేందుకే చంద్రబాబును అరెస్టు చేశారనే అనుమానం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు లోకేశ్ గురువారం ట్వీట్ చేశారు. "మా అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. చంద్రబాబును జైల్లోనే చంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రతిపక్ష నేతకు జైల్లో హాని తలపెట్టేలా సర్కారు కుట్ర పన్నుతోంది. జైలులో విపరీతంగా దోమలు కుడుతున్నాయని చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదు. జైలులో

- మిగతా 2 లో

కెనడా పౌరులకు భారత వీసాల నిలిపివేత

న్యూఢిల్లీ/ఒట్టావా: కెనడాకు భారత్ మరో షాక్ ఇచ్చింది. ఆ దేశ పౌరులకు భారత వీసాలను నిలిపివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య క్రమంలో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలు దెబ్బతిన్న క్రమంలో తాజా పరిణామం చర్చనీయాంశంగా మారింది. తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకూ ఈ నిషేధం కొనసాగుతుందని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వర్గాలు వెల్లడించాయి. 'భారత దౌత్యకార్యాలయం ముఖ్య గమనిక: ఆపరేషనల్ కారణాలతో సెప్టెంబరు 21వ తేదీ నుంచి తదుపరి ఆదేశాల వరకు కెనడాకు సంబందించి భారత వీసా సేవలు నిలిచిపోయాయి. మరింత సమాచారం కోసం బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (లిస్టెట్ కంపెనీ) వెబ్‌సైట్‌ను చూడండి' అని భారత వీసా దరఖాస్తు కేంద్రం కెనడాకు చెందిన అధికారిక వెబ్‌సైట్‌లో పెట్టిన నోటిఫికేషన్ పేర్కొంది. అయితే కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలు, రాజకీయ విద్వేష నేరాలు, హింసాత్మక ఘటనలు పెచ్చరిల్లుతున్నాయని, అక్కడి భారత పౌరులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ హెచ్చరికలనూ జారీ చేసింది. ఈ హెచ్చరికలను కెనడా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. తమది సురక్షితమైన దేశమని ఆదేశ ప్రజా భద్రతా మంత్రి డొమినిక్ లెబ్లాంక్ వెల్లడించారు. కాగా, కెనడాలో 2,30,000 మంది భారతీయ విద్యార్థులు, 7,00,000 మంది ఎన్ఆర్ఐలు ఉన్నట్లు ఒట్టావాలోని భారత హై కమిషన్ వెబ్‌సైట్ వెల్లడించింది.

కెనడాలో మరో ఖాలిస్తానీ హత్య

ఒట్టావా: ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత కెనడా, భారత్ మధ్య దౌత్యబంధం బీటలువారింది. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నడుమ మరో ఖాలిస్తానీ హత్యకు గురికావడం కలకలం రేపింది. కెనడాలో ముఠాల మధ్య పోరులో ఖలిస్తానీ వేర్పాటువాది సుఖా దునేకే కాల్చివేతకు గురైనట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కెనడాలో ఖలిస్తానీ ఉద్యమంలో దునేకే కీలకంగా ఉన్నాడు. పంజాబ్‌లోని మోగాకు చెందిన దునేకే ఏ కేటగిరీ గ్యాంగస్టర్. నకిలీ పాస్‌పోర్ట్‌తో 2017లో కెనడాకు వెళ్లాడు. ఉగ్రవాద నిరోధక సంస్థ 'ఎన్ఐఏ' విడుదల చేసిన జాబితాలో ఖలిస్తాన్, కెనడాతో సంబంధాలున్న 43 మంది గ్యాంగ్‌స్టర్లలో ఒకడిగా ఉన్నాడు. ఇతను వేర్పాటువాది అర్ష్‌దీప్ దల్లాకు అత్యంత సన్నిహితుడని సమాచారం.

ఇదిలావుంటే, ఖలిస్తానీ వేర్పాటువాదుల హత్యల వెనుక భారత్ ఉన్నట్లు కెనడా ఆరోపణలు చేయడంతో అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. ఈ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతకు దారితీసిన కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యుపై అమెరికా నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాశ్చాత్య దేశాలకు ఆసియా-పసిఫిక్‌లో అత్యంత వ్యూహాత్మక భాగస్వామి దేశమైన భారత్‌కు వేర్పాటువాది నిజ్జర్ హత్యతో ముడిపెట్టడం సిగ్గుమాలిన చర్యగా అమెరికన్ ఎంటర్‌ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫెలో మైకేల్ రూబిన్ వ్యాఖ్యానించారు. నిజ్జర్ హత్య ఘటనపై దర్యాప్తునకు భారత్ సహకరించాలని శ్వేతసౌధం కూడా ఓ ప్రకటనలో కోరింది.

జనవరి చివరిలో సార్వత్రిక ఎన్నికలు

పాకిస్తాన్ ఎన్నికల కమిషన్ ప్రకటన

ఇస్లామాబాద్: వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో పాకిస్తాన్‌లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఆ దేశ ఎన్నికల కమిషన్ (ఈసీపీ) గురువారం ప్రకటించింది. నియోజకవర్గాల పునర్విభజన పనులను సమీక్షించినట్లు తెలిపింది. నియోజకవర్గాల పునర్విభజన తొలి జాబితాను ఈనెల 27న ప్రచురించాలని నిర్ణయించినట్లు పేర్కొంది. ఈ కసరత్తుపై వ్యక్తమయ్యే అభ్యంతరాలు, వచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకొని తుది జాబితాను నవంబరు 30న జారీ చేయాలని భావిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. 54 రోజుల ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత అంటే జనవరి చివరి వారంలో ఎన్నికలు జరుగుతాయని తెలిపింది. సార్వత్రిక ఎన్నికల కోసం ప్రవర్తనా నియమావళిపై చర్చించేందుకు వచ్చేనెలలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించబోతున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే ఈసీపీ తాజా ప్రకటన వెలువరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యాంగబద్ధ పదవీకాలం ముగియడానికి మూడు రోజుల ముందు పాకిస్తాన్ పార్లమెంటు రద్దు అయింది. రాజ్యాంగంలోని అధికరణ 224 ప్రకారం పార్లమెంటు రద్దు అయిన 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన నవంబరు 7న ఎన్నికలు జరగాలి.

అయితే ఎన్నికల చట్టంలోని సెక్షన్ 17(2) ప్రకారం ప్రతిసారి జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజనను కమిషన్ అధికారికంగా ప్రకటించాలి. ఈసీపీతో తుది చర్చల్లో ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలన్నదానిపై రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశాయి. కాగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని జనవరిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఈసీపీ తెలిపింది.

తీర్పు మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ప్రత్యేక పీపీ వివేకానంద వాదనలు వినిపించారు. అరెస్టు అనంతరం పూర్తిస్థాయిలో విచారించడానికి తగిన సమయం లేదన్నారు. పోలీసు కస్టడీలో విచారణ చేస్తే తప్పేముందని ప్రశ్నించారు. విచారణకు సహకరించాలని ఇద్దరికి నోటీసు ఇస్తే విదేశాలకు వెళ్లిపోయారని, డొల్ల కంపెనీలకు మళ్లించిన ప్రజాధనం ఎవరికి చేరింది అనేది ఇంకా తేల్చాల్సి ఉందని చెప్పారు. ఇది రూ.371 కోట్ల ప్రజాధనం వ్యవహారమని, వాస్తవాలు వెలికితీయాలంటే పోలీసు కస్టడీలో విచారణ అవసరమని సీఐడీ తరపు న్యాయవాది వాదనలు వినిపించిన విషయం తెల్సిందే.

చంద్రబాబును జైల్లో చంపేందుకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

రిమాండ్ ఖైదీగా ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకట సత్యనారాయణ డెంగీతో మరణించారు. చంద్రబాబునూ ఇలాగే చేయాలని సైకో కుతంత్రాలు అమలు చేస్తున్నారు. చంద్రబాబుకుకి ఏం జరిగినా సైకో జగన్‌దే బాధ్యత" అని లోకేశ్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

'పోర్టర్' రాహుల్‌గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రేమగా ఆహ్వానించారు. రెక్కలు ముక్కలు చేసుకునే భారత సోదరుల కోరికను తీర్చాల్సిందే' అని పోస్టు పెట్టారు. ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ స్పందిస్తూ భారత్ జోడో యాత్ర కొనసాగుతోందని పేర్కొంది. రైల్వే కూలీలతో రాహుల్ సరదా సమయం, చర్చల చిత్రాలు, వీడియోలను పంచుకుంది. 'ప్రజల హీరో రాహుల్ గాంధీ ఈరోజు ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వేస్టేషన్‌లో పోర్టర్ మిత్రులను కలిశారు. ఆయనను కలవాలన్న కోరికను వ్యక్తం చేసిన రైల్వేస్టేషన్‌లోని పోర్టర్ మిత్రుల వీడియో ఒకటి ఈ మధ్య వైరల్ అయింది. రాహుల్ నేడు వారిని చేరుకున్నారు. వారు చెప్పాలనుకున్నది విన్నారు. భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది' అని పేర్కొంది.

మా పోరాట ఫలితమే

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడం వారి రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని రాజా అన్నారు. దేశంలో వామపక్ష సంఘాలపై నిషేధం లేదని గుర్తు పెట్టుకోవాలని నొక్కిచెప్పారు. స్వాతంత్ర్య సమయంలో పోరాడాని మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, దేశానికి అనేకమంది జాతీయ నాయకులను అందించిందని గుర్తుచేశారు. ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులపై దాడికి బాధ్యులతో పాటు పోలీసులపై తగు చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని సీపీఐ తరపున డి.రాజా డిమాండ్ చేశారు. ఫాసిస్టు దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని జమ్ముకశ్మీర్‌తో పాటు దేశంలోని ప్రజాస్వామికవాదులకు పిలుపునిచ్చారు.

అసెంబ్లీ ఉద్రిక్తం

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఆగ్రహమొస్తే సభలో అవాంఛనీయ సంఘటనలు జరిగే పరిస్థితి తలెత్తుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. నందమూరి బాలకృష్ణను ఉద్దేశించి...మీసం మెలేయడానికి ఇది సినిమా కాదని, తాను కూడా మీసం మెలేస్తూ...రా చూసుకుందామని సవాల్ విసిరారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల సవాళ్లు, ప్రతిసవాళ్లతో సభలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో సభను స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమైన అనంతరం కూడా చంద్రబాబు అరెస్ట్‌పై చర్చకు పట్టుబడుతూ టీడీపీ సభ్యులు మళ్లీ ఆందోళన కొనసాగించారు. సభ ప్రారంభమైన తర్వాత బాలకృష్ణకు స్పీకర్ తమ్మినేని సీతారామ్ హెచ్చరిక జారీ చేశారు. సభలో మీసాలు మెలివేయడం, తొడగొట్టడం వంటి రెచ్చగొట్టే పనులను బాలకృష్ణ చేశారని, ఇంకోసారి ఇలాంటి పనులు చేయవద్దని, ఆయనకు తొలి హెచ్చరిక జారీ చేస్తున్నామని చెప్పారు. మరోసారి ఇలాంటి పనులు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు టీడీపీ ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వైసీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఈ అసెంబ్లీ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. సభాస్థానంలో ఉన్న ఫైళ్లను చించేశారని, బాటిల్‌ను పగలగొట్టారని, మైక్ లాగేశారని, వైర్లు తెంచేశారని, వీరి ప్రవర్తనను గర్హిస్తూ ముగ్గురినీ ఈ సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నానని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఎథిక్స్ కమిటీని కోరుతున్నానని చెప్పారు. ఇలాంటి సభ్యుల ప్రవర్తనను ఖండించలేకపోతే సభా మర్యాదను కాపాడలేమని అన్నారు. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియం చుట్టుముట్టి మరలా ఆందోళనను ఉధృతం చేయడంతో స్పీకర్ వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.

టీడీపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

చంద్రబాబు అరెస్ట్ అక్రమమంటూ శాసనసభలో ఆందోళన చేపట్టిన ఆ పార్టీ సభ్యులను స్పీకర్ తమ్మినేని సీతారామ్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలకు అడ్డు తగులుతున్నారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆరోపిస్తూ 15 మందిని సస్పెండ్ చేయాలంటూ స్పీకర్‌ను కోరారు. దీంతో 14 మంది టీడీపీ సభ్యులు, వైసీపీకి చెందిన ఉండవల్లి శ్రీదేవిని గురువారం ఒక్కరోజు సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని ప్రకటించారు. సస్పెండైన టీడీపీ ఎమ్మెల్యేల్లో కింజరాపు అచ్చెన్నాయుడు, నందమూరి బాలకృష్ణ, బెందాళం అశోక్, ఆదిరెడ్డి భవాని, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్ప, గణబాబు, గద్దె రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గొట్టిపాటి రవికుమార్, ఏలూరి సాంబశివరావు, డోలా బాలవీరాంజనేయ స్వామి ఉన్నారు.

జీరో అవర్‌కే పరిమితం

శాసనసభ తొలిరోజు సమావేశం ప్రశ్నోత్తరాలతో ప్రారంభమై జీరో అవర్‌తో ముగిసింది. ప్రశ్నోత్తరాలు ప్రారంభం కాగానే అధికారపార్టీకి చెందిన సభ్యులు విశ్వసరాయ కళావతి, రెడ్డి శాంతి, దాసరి సుధ కళ్యాణమస్తు పథకం ద్వారా ఇప్పటివరకు ఎంతమంది వ్యక్తులు లబ్ధిపొందారని అడిగిన ప్రశ్నకు మంత్రి నాగార్జున సమాధానమిస్తుండగా ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో అసెంబ్లీ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేసి, స్పీకర్ జీరో అవర్ నిర్వహించి సభను శుక్రవారానికి వాయిదా వేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేవలం బీఏసీ సమావేశానికి మాత్రమే హాజరయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగుల ప్రమాద బీమా

రూ.కోటి పది లక్షలకు పెంపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమాను రూ.45 లక్షల నుంచి కోటి పది లక్షలకు పెంచుతూ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ ఆర్టీసీ బస్‌హౌస్‌లో గురువారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో ఏపీఎస్ఆర్టీసీ-ఎస్‌బీఐ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఎస్‌బీఐ వేతన ప్యాకేజ్ ద్వారా ఉద్యోగి ప్రమాదవశాత్తూ మరణిస్తే ప్రస్తుతం ఇస్తున్న రూ.45 లక్షల వేతన ప్యాకేజీని, ఎస్‌బీఐ అధికారులను ఒప్పించి రూ.కోటి పది లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ప్రమాద బీమా, ఇతర సదుపాయాలు నాలుగేళ్లుగా అమలులో ఉన్నాయన్నారు. ఉద్యోగులకు ఇంకా మెరుగైన సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఎస్‌బీఐ ఉన్నతాధికారులతో తాను సంప్రదింపులు చేపట్టి, మెరుగైన ప్రమాద బీమా పథకాన్ని రూపొందించినట్లు వివరించారు. ప్రమాద బీమా రూ.30లక్షల నుంచి రూ.85 లక్షలకు పెంచినట్లు, రూపే డెబిట్ కార్డు లింకేజీ ద్వారా రూ.10 లక్షల ప్రమాద బీమా, కొత్త రూపే కార్డు ద్వారా మరో రూ.10 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించినట్లు ఎండీ చెప్పారు. మొత్తంగా వివిధ రూపాల్లో ఉద్యోగులకు కోటి పది లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా లభిస్తుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు నిరంతరం కష్టపడుతూ జీవితాలని పణంగా పెట్టి ఉద్యోగాలు నిర్వహిస్తారని, అలాంటి వారికి ప్రమాద బీమా మొత్తం ఇలా పెరగడం శుభ పరిణామమని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల కష్టాన్ని మంచి హృదయంతో అర్థం చేసుకుని మెరుగైన బీమా పథకం అందుబాటులోకి తెచ్చిన బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్యాకేజ్ ఈ ఏడాది సెప్టెంబరు 3వ తేదీ నుంచి 2026 సెప్టెంబరు 2వరకు అనగా మూడు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతుందని, ఇప్పటివరకు రూ. 45లక్షలుగా ఉన్న ప్రమాద బీమా ఒక కోటి 10 లక్షలకు చేరుతుందని వివరించారు.

పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులందరినీ ప్రభుత్వంలో విలీనం చేసి వారి సంక్షేమానికి బాట వేశారన్నారు. దాంతోనే ఇన్ని ప్రయోజనాల్ని ఆర్టీసీ ఉద్యోగులు పొందగలుగుతున్నారని స్పష్టంచేశారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక మొదటగా ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద మొత్తంలో పెన్షన్ పొందారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రమాద బీమా పెంచడం శుభపరిణామమన్నారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎండీకి ధన్యవాదాలు తెలిపారు. ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ఓం నారాయణ శర్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా చాలా ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఎస్‌బీఐ సేవలందిస్తోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు సైతం ఈ తరహాగా మెరుగైన ప్రమాద బీమా వర్తింపజేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు పి.కృష్ణమోహన్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీటీడీ ఈయూ హర్షం

ప్రమాద బీమా పెంపుపై ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టిదామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న మంత్రి విశ్వరూప్‌కు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు రాష్ట్ర కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

తప్పని డోలీ మోతలు

మారని గిరిజన బతుకులు

విశాలాంధ్ర- దుంబ్రిగూడ: స్వాతంత్ర్యం సిద్ధించి దశబ్దాలు గడుస్తున్నా మారుమూల గ్రామాల గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదు. గిరిజన గ్రామాల్లో సరైన రోడ్డు సౌకర్యం ఇప్పటికీ కల్పించకపోవడంతో అనారోగ్యానికి గురైన ప్రజలకు వైద్య సేవలు గగనంగా మారాయి. వాహన సౌకర్యం లేక డోలీలతో గిరిజనులను మోసుకెళ్లాల్సిన దారుణ పరిస్థితి. ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నా మారుమూల గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ మండలంలోని గసభ పంచాయతీ సిమిలిగూడ గ్రామానికి చెందిన గెమ్మెలి రమేశ్(30) అనారోగ్యానికి గురవ్వడంతో కుటుంబ సభ్యులు డోలితో ఆస్పత్రికి తరలించారు. సిమిలిగూడ గ్రామంలో కేవలం మట్టి రోడ్డు నిర్మించారు. తారు రోడ్డు నిర్మించాలని ఆ గ్రామస్తులు ఉన్నతాధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. వర్షాల కారణంగా మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రోగులను డోలీలతో మోసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

సిమిలిగూడ గ్రామానికి వెంటనే తారు రోడ్డు నిర్మించాలని గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.సురేశ్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌కు, ఐటీడీఏ పీఓకు, ఎమ్మెల్యేకు, ఇంజినీరింగ్ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా రోడ్డు నిర్మించడం లేదని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సకాలంలో వైద్య సేవలు అందక అమాయక గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిమిలిగూడ గ్రామానికి ఆనుకొని శిరస్సుగూడ గ్రామంలో 60 మంది గిరిజనులు ఉన్నారని, ఒడిశా సరిహద్దు కావడంతో అభివృద్ధికి దూరంగా ఉన్నారని చెప్పారు. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో గిరిజనులు బాధపడుతున్నారన్నారు. తక్షణమే గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని ఆయన కోరారు.

కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజన వంటి మెలికలు పెట్టకుండా 2024 ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, ఓబీసీలకు, ముస్లింలకూ కోటా కల్పించాలని డిమాండ్ చేశాయి. మహిళా బిల్లుపై రాజ్యసభలో పొద్దుపోయేంత వరకు సుదీర్ఘంగా చర్చ జరిగింది.

చర్చలో భాగంగా రాజ్యాంగంలో 128వ సవరణ బిల్లుపై సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. సీపీఐ, సీపీఎం ఎంపీలు వినయ్ విశ్వం, సంతోశ్ కుమార్, ఇ. కరీం మాట్లాడుతూ జగగణన, పునర్విభజన వంటి అడ్డంకులన్నీ తొలగించి బిల్లును వచ్చే ఎన్నికల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్‌తో పాటు ఢిల్లీ స్థానిక ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ ఎన్నికల గిమ్మిక్కుగా ఈ బిల్లును తెచ్చిందని విమర్శించారు. మణిపూర్‌లో మహిళలపై దురాగతాలు, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులపై మౌనం వహించిన బీజేపీకి 'నారీశక్తి' ఎన్నికలకు ముందు గుర్తు వచ్చిందా అని ఎద్దేవా చేశారు. 2014తో పాటు 2019 ఎన్నికలప్పుడు మహిళా బిల్లును తెస్తామని మోదీ ప్రభుత్వం హామీనిచ్చింది కానీ ఆ పని చేసేందుకు పదేళ్లు తీసుకుందని వ్యాఖ్యానించారు. విలువైన ఈ కాలాన్ని మహిళలు కోల్పోవాల్సి వచ్చిందని వామపక్ష నేతలు అన్నారు. నారీ శక్తి వందన్ అధినియం బిల్లును ఇప్పుడు తేవడం ఎందుకని జేడీయూ నేత రామ్‌నాథ్ ఠాకూర్ ప్రశ్నించారు. రిజర్వేషన్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ ఎంపీ కె.కేశవరావు డిమాండ్ చేశారు. 2011 జనగణనను కొలమానంగా తీసుకోవచ్చని సూచన చేశారు. పునర్విభజన కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని కేశవరావుతో పాటు ఎండీఎంకే నేత వైగో కోరారు. ఇతర వెనుకబడిన వర్గాలకూ సమాన ప్రయోజనాలు కల్పించేలా ఈ బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు సిఫార్సు చేయాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా సూచించారు. మహిళా రిజర్వేషన్లను లోక్‌సభకు, అసెంబ్లీలకే పరిమితం చేయకుండా రాజ్యసభ, శాసనమండళ్లకూ విస్తరించాలని వైఎస్ఆర్‌సీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి సూచించారు. మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలునకు కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఓబీసీ మహిళలకూ కోటా కల్పించాలన్నారు. జీవితాలు మార్చే శాసనాలు మనస్ఫూర్తిగా జరగాలని నొక్కిచెప్పారు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఓ బ్రెయిన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి కావాల్సింది సహకార ధోరణి తప్ప కమాండో తరహా గోప్యమైన పనితీరు కాదని అన్నారు. 2024 నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని, ఆర్టికల్334ను తొలగించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోందని డెరెక్ తెలిపారు. 2024 కాదు 2034 అని... అక్కడ తప్పుగా అచ్చు అయిందన్న విమర్శలు వస్తున్నాయన్నారు. రాజ్యసభలో 33 శాతం రిజర్వేషన్ కల్పనపై సమగ్ర చర్చ అవసరమన్నారు. 'ఇది హడావిడిగా చేయలేరు కానీ బిల్లును తీసుకు రండి. దానిపై చర్చిద్దాం. ఇప్పుడు అనుచితంగా అనిపించవచ్చు కానీ ఆరు-పదేళ్ల తర్వాత అలా అనిపించదు అని డెరెక్ అన్నారు. ఓబీసీలు, ముస్లిం మహిళలకూ స్థానం కల్పించాలని ఎస్పీ ఎంపీ జయాబచ్చన్ డిమాండ్ చేశారు. మీరు ట్రిపుల్ తలాక్ గురించి మాట్లాడినప్పుడు ముస్లిం మహిళలకు రిజర్వేషన్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మీ చిత్తశుద్ధిని మాటల్లో కాదు చేతల్లో చూపించండి అని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఇది ఎన్నికల జుమ్లాగా మారకూడదని కోరుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని పార్టీల తరపున బిల్లుకు మనస్ఫూర్తిగా, బేషరతుగా మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. సభ్యులంతా తమ సలహాలు, సూచనలు, డిమాండ్లను సభ ముందు ఉంచారు. అయితే బిల్లుకు మద్దతు ప్రకటించారు.

ఏకాభిప్రాయం కీలకం: నిర్మలా సీతారామన్

మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా ముందుకెళ్లేందుకు ఏకాభిప్రాయం కుదరడం ఎంతో ముఖ్యమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. నాడు పీవీ నరసింహారావు ప్రభుత్వం పంచాయతీల్లో 33శాతం రిజర్వేషన్‌ను మహిళలకు కల్పించిందని, ఆ ఘనత మాజీ ప్రధాని సొంతమని చెప్పారు. నాటి పరిణామ ఫలితంగా నేడు పంచాయతీ స్థాయిలో మహిళా ప్రాతినిధ్యం పెరిగిందని, రిజర్వేషన్ 33శాతం నుంచి 50శాతానికి చేరుకుందని అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు బీజేపీ కట్టుబడి ఉందని చెప్పారు. అధికరణ 370, ట్రిపుల్ తలాక్ వంటివి ప్రస్తావించారు. మహిళలకు సంబంధించిన అంశాల్లో బీజేపీ ఎలాంటి ఆటలు ఆడదని, ప్రధాని మోదీ నమ్మకానికి సంబంధించిన అంశం కాబట్టి గతంలోనూ, ఇప్పుడు కూడా చెప్పిన దానికి కట్టుబడతామని నిర్మలా సీతారామన్ అన్నారు.

వైస్ చైర్‌పర్సన్‌ల ప్యానల్ ఏర్పాటు

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. నారీ శక్తి వందన్ అధినియం బిల్లుపై చర్చ జరుగుతుండగానే 13 మంది రాజ్యసభ మహిళా సభ్యులతో వైస్ చైర్‌పర్సన్‌ల ప్యానల్‌ను ఏర్పాటు చేశారు. సభాపతిగా మహిళలు ఉంటే మార్పు దిశగా మంచి సందేశం వెళుతుందని అన్నారు. ఈ ప్యానల్‌కు నామినేట్ అయిన సభ్యులలో పీటీ ఉషా, ఎస్‌ఫాగ్నమ్ కొన్‌యక్, జయా బచ్చన్, సరోజ్ పాండే, రజనీ అశోక్‌రావ్ పాటిల్, ఫౌజియా ఖాన్, డోలా సేన్, ఇందు బాలా స్వామి, కణిమొళి, సోము, కవితా పాటిదార్, మహువా మాజి, కల్పనా సైని, సులాతా డియో ఉన్నారు.

మరో విద్యుత్ ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

దోపిడీ చేస్తున్నారని, చండీగఢ్, మధ్యప్రదేశ్‌లో స్మార్ట్ మీటర్లు రూ.7900 లోపు ఉంటే...ఆంధ్రప్రదేశ్‌లో 32 వేల రూపాయలకు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. అదానీ, కడప జిల్లాకు చెందిన శిరిడిసాయి కంపెనీకి లబ్ధి చేకూర్చే లక్ష్యంతోనే ఒప్పందాలు కుదిరాయన్నారు. స్మార్ట్ మీటర్లను కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చాయని గుర్తు చేశారు. ప్రధాని మోదీ, సీఎం జగన్ కార్పొరేట్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తి పడి ప్రజలపై భారాలు వేశారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల అవినీతిలో కూరుకుపోయిన జగన్... అవినీతిపై అసెంబ్లీలో చర్చించాలనటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధం కొనసాగుతోందని, పోలీసు రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను సన్నద్ధం చేస్తున్నట్లు రామకృష్ణ చెప్పారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీల పేరుతో ప్రతి మూడు నెలలకోసారి భారాలు వేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పును చార్జీలు పెంచడం ద్వారా ప్రజల నుంచి వసూలు చేస్తున్నారని చెప్పారు. విద్యుత్ చార్జీలు పెరగడం, కోతల కారణంగా పరిశ్రమలు మూడు షిఫ్టులకుగాను ఒక షిఫ్టుకే పరిమితమయ్యాయన్నారు. మోదీ ఆదేశాన్ని జగన్ అమలు చేస్తున్నారని, దీనిఫలితంగా ప్రజలపై మోయలేని భారం పడుతోందని చెప్పారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలు రోడ్డుపైకి రాలేని సమయంలో మోదీ సర్కారు మూడు నల్ల సాగుచట్టాలు, విద్యుత్ సవరణ బిల్లు తీసుకొచ్చిందని విమర్శించారు. రైతుల అలుపెరగని పోరాటంతో సాగు చట్టాలు వెనక్కి తీసుకోకతప్పలేదని గుర్తుచేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పోలారి మాట్లాడుతూ ప్రజలు కరెంటు చార్జీలు, నిత్యావసర వస్తువులధరల భారంతో సతమతమవుతున్నారని చెప్పారు. బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమానికి అండగా ఉన్న వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు ఆయన కుమారుడు జగన్ విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను అదానీ కట్టబెట్టడంతో రానున్న రోజుల్లో కరెంటు చార్జీలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.హరినాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రకటిత కర్ఫ్యూ కొనసాగుతోందన్నారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం తగదన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ సుంకం రద్దు చేయాలని, వడ్డీ భారాల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రామకృష్ణ, ఎంసీపీఐ నాయకులు ఖాదర్ భాషా, ఎస్‌యూసీఐ (సి) నాయకులు కె.సుధీర్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎంఏ గఫూర్, వామపక్ష నేతలు గనిరాజు, కేశవరావు, మూలి సాంబశివరావు, రామన్న, రవిచంద్ర, రమణ, వి.వెంకటేశ్వర్లు, దడాల సుబ్బారావు, ప్రసన్నకుమార్, సాయికుమార్, రాజేష్, కమల, శోభన్ కుమార్ మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశం కీలక తీర్మానాలు చేసింది.

ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం

అచ్చెన్నాయుడు, బాలకృష్ణ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు, జగన్ అరాచక చర్యలపై ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగేది కాదన్నారు. ప్రజలంతా తమ వెంటే ఉన్నారని తెలిపారు. ప్రజల్లో తెలుగుదేశానికి ఉన్న స్పందన చూసే అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. అక్రమ అరెస్టులు, అక్రమ కేసులకు భయపడేది లేదని వారు తేల్చిచెప్పారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం శాసనసభాపక్షం నివాళులర్పించింది. చంద్రబాబు అరెస్టు అక్రమమని గళమెత్తటమే ప్రధాన అజెండాగా చట్టసభలకు వెళ్తున్నామని తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పష్టంచేశారు. చేసిన తప్పునకు ప్రభుత్వం భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై తాము ఇచ్చిన వాయిదా తీర్మానంపై చర్చ చేపట్టాకే మరే అంశమైనా చేపట్టాలని డిమాండ్ చేశారు. సచివాలయం సమీపంలోని తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి అసెంబ్లీ వరకు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు నిరసన ప్రదర్శన చేపట్టారు. 'చంద్రబాబుపై కక్ష - యువత భవితకు శిక్ష' అనే బ్యానర్‌తో పాటు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. చంద్రబాబుపై అక్రమ కేసు ఎత్తేసి వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

దార్శనికుడు గురజాడ

పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం: స్త్రీల సమస్యలపై మహాకవి గురజాడ మంచి సాహిత్యం రాశారని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ చెప్పారు. స్త్రీల శ్రమశక్తి వంటింటిలో నిర్వీర్యమైపోతుందన్న అభిప్రాయాన్ని గురజాడ వ్యక్తపరిచారని, అందుకే వంటిల్లు నిషేధించాలని గురజాడ పేర్కొన్నారని లక్ష్మీనారాయణ గుర్తుచేశారు. విజయనగరం జేఎన్‌టీయూలో మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. జేఎన్‌టీయూ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. గురజాడ గొప్ప దార్శనికుడని, సామాన్యులకు సైతం అర్థమయ్యేలా గురజాడ సాహిత్యం ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ ఉపకులపతి కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గురజాడ నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. రెండు శతాబ్దాల ముందుచూపు ఉన్నవారని చెప్పారు గురజాడ రాసిన దేశభక్తి అందుకు నిదర్శనమన్నారు. విద్యార్థులు, యువతరం గురజాడ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి శరత్‌చంద్ర, జ్యోతి శ్రీ మాట్లాడుతూ గురజాడ సాహిత్యాన్ని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. విజయనగరం జిల్లా అధ్యక్షుడు జీఎస్ చలం మాట్లాడుతూ వాడుక భాషలో చదువు కొనసాగించడానికి గురజాడ చేసిన కృషిని వివరించారు. కాగా, ఈ తరం కోసం కవితా స్రవంతి అనే కార్యక్రమంలో భాగంగా అరసం ముద్రించిన గురజాడ కవితా సంకలనాన్ని వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. జేఎన్‌టీయూ పరిధిలోని 33 కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించగా ఆంగ్లంలో సంధ్య జాగరపు, సంజనా వర్మ, వైష్ణవి గుప్త ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. తెలుగులో దేబార్కి మణికంఠ, జాజుల లావణ్య ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. 60 మంది విద్యార్థులు కవితల పోటీలో పాల్గొన్నారు. విజేతలకు రిజిస్ట్రార్ జి.జయసుమ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని అరసం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ నిర్వహించగా కోఆర్డినేటర్‌గా ఈసీఈ విభాగాధిపతి డా.బి.నళిని వ్యవహరించారు. ఆంగ్ల ఉపాధ్యాయులు పి.మహేశ్ వందన సమర్పణ చేశారు.

చిరస్మరణీయుడు గురజాడ

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సంఘ సంస్కరణ కోసం, తెలుగు భాష వికాసం కోసం ఎనలేని కృషి చేసిన గురజాడ అప్పారావును తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువరని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్ర నాయక్ అన్నారు. గురువారం ఇక్కడి చిట్టినగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో గురజాడ 161వ జయంతి సభ జరిగింది. ఎస్.కె.నజీర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావుతో కలిసి చంద్రనాయక్ గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో ఉన్న వివిధ రకాల మూఢనమ్మకాలు, రుగ్మతలను నివారించడానికి గురజాడ ఎనలేని కృషి చేశారన్నారు. తెలుగు భాష ప్రజల భాషగా తీసుకు రావడంలో ఆయన కృషి మరవరానిదని కొనియాడారు. కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, దిద్దుబాటు తదితర కావ్యాలను రచించి సమాజంలో స్త్రీల సామాజిక సమస్యలను నాటకాల ద్వారా వివరించి ప్రజలను చైతన్య పరిచారన్నారు స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు కిందిస్థాయి నుంచి దేశభక్తి భావన, సమాజం పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. ప్రజా చైతన్యానికి ప్రజానాట్యమండలి ఎనలేని కృషి చేసున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర ప్రజానాట్యమండలి కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, పాఠశాల అధ్యాపకులు, మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థులు 'దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా' గేయాలపన చేశారు.

106 చెరువులకు

యుద్ధ ప్రాతిపదికన నీళ్లు నింపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య డిమాండ్

విశాలాంధ్ర- పత్తికొండ: హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా కర్నూలు జిల్లాలోని 106 చెరువులకు యుద్ధ ప్రాతిపదికన తక్షణమే నీళ్లు నింపి, పంట పొలాలను కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సీపీఐ ప్రతినిధి బృందం గురువారం నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ చెరువు తో పాటు చందోలి చెరువు, తుగ్గలి మండలం ముక్కెళ్ల, మారెళ్ల, బొందిమడుగుల, ఆర్ఎస్ పెండేకల్, రాంపల్లి, చెన్నంపల్లి, పగిడిరాయి, జొన్నగిరి, తుగ్గలి, రాతన గ్రామాలలో ఉన్న చెరువులను పరిశీలించింది. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూడు రోజుల క్రితం పత్తికొండ, డోన్ నియోజకవర్గాలలోని కటారుకొండ, ఆలం కొండ గ్రామాల దగ్గర ఎంతో హడావుడిగా 77 చెరువులకు నీళ్లు వదులుతున్నామని బటన్ నొక్కి ప్రారంభించారని, అయితే కేవలం 44 చెరువులకు మాత్రమే నీళ్లు వదులుతున్నట్లు అధికారులు లెక్కలు చెపుతున్నారన్నారు. నెల రోజుల క్రితం శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి లభ్యత ఉన్నప్పుడు చెరువులకు నీళ్లు నింపింతే రైతులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. ఖరీఫ్ సీజన్ గడువు ఈనెలాఖరితో ముగుస్తుందని, పెండింగులో ఉన్న పైపులైన్ పనులను పూర్తిచేసి హంద్రీనీవా ద్వారా జిల్లాలోని 106 చెరువులకు యుద్ధ ప్రాతిపదికన నీళ్లు నింపి, పంట పొలాలను కాపాడాలన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్ నియోజకవర్గంలో అనేక చెరువులకు నీళ్లు నింపారని, పత్తికొండ నియోజకవర్గంలో ఒకటి, రెండు చెరువులకు తప్ప, ఎక్కడా కూడా నీళ్లు నింపింది లేదన్నారు. చెరువులకు నీళ్లు నింపే ప్రక్రియ పాలకులకు ఎన్నికల నినాదంగా మారిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, పత్తికొండ, తుగ్గలి మండలాల కార్యదర్శులు డి.రాజా సాహెబ్, సుల్తాన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సర్కారుకు ఓటమి తప్పదు

టీడీపీ దీక్షకు జగదీశ్ సంఘీభావం

విశాలాంధ్ర-గుంతకల్లు: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్.జితేంద్రగౌడ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రానికి చీకటిరోజులు వచ్చాయని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం పేరుతో చంద్రబాబును అక్రమంగా రాజమండ్రి జైలుకు పంపారన్నారు. ఇది అక్రమ కేసని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబును జైలుకు పంపి...వేధింపులకు గురిచేయడం, టీడీపీని నిర్వీర్యం చేయడం ముఖ్యమంత్రి జగన్ కుట్రలో భాగమని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్టుతో రానున్న ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసమే కుట్రతో చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలంతా చంద్రబాబును జైలుకు పంపడాన్ని ఖండిస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. సీఐడీని జగన్ ప్రైవేట్ సైన్యంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. త్వరలో లోకేశ్, అచ్చెన్నాయుడిని అరెస్టు చేస్తామని ప్రభుత్వం బెదిరిస్తోందన్నారు. జగదీశ్ వెంట సీపీఐ నాయకులు బి.మహేశ్, ఎస్ఎండీ గౌస్, రాము రాయల్, రామాంజనేయులు, సురేశ్,ఉమర్ భాష తదితరులు ఉన్నారు.

వాయిదా తీర్మానాల తిరస్కరణ

మండలిలో పీడీఎఫ్, టీడీపీ సభ్యుల నిరసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జీపీఎస్‌కు వ్యతిరేకంగా శాసనమండలిలో పీడీఎఫ్, ఉపాధ్యాయ సభ్యులు, చంద్రబాబు అరెస్టుపై టీడీపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను చైర్మన్ గురువారం తిరస్కరిం చారు. శాసనమండలి సమావేశాలు తొలి రోజు ఉదయం 10 గంటలకు చైర్మన్ కొయ్యే మోషేను రాజు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు ప్యానెల్ స్పీకర్లుగా మర్రి రాజశేఖర్, కుంభా రవిబాబు, చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్, కంచర్ల శ్రీకాంత్ వ్యవహరించనున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అనంతరం మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుపై టీడీపీ సభ్యులు పర్చూరి అశోక్‌బాబు, వేపాడ చిరంజీవిరావు, పంచుమర్తి అనురాధ తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానం, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు - జీపీఎస్ పరిచయంపై ఉపాధ్యాయ, పీడీఎఫ్ సభ్యులు షేక్ సాబ్జి, ఇళ్ల వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, రఘురాజు తదితరులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరి స్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. రాష్ట్రంలో అరాచక పాలన, షెల్ కంపెనీల సృష్టికర్త జగన్, ఓటమి భయంతోనే చంద్రబాబుపై అక్రమ కేసులు వంటి నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతబట్టి టీడీపీ సభ్యులు నిరసనకు దిగారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. పోడియం పైకి వచ్చి చైర్మన్ కుర్చీని చుట్టుముట్టారు. అదే సమయంలో ఉపాధ్యాయ, పీడీఎఫ్ సభ్యులు జీపీఎస్ వద్దు, పాత పెన్షన్ విధానమే ముద్దు అంటూ వెల్‌లో నిలబడి నినదించారు. ఈ సమయంలోనే చైర్మన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. రజక సామాజిక వర్గానికి నీటి తొట్టెల వినియోగ హక్కుల విషయంపై సభ్యులు దువ్వారపు రామారావు, తిరుమల నాయుడు, అనూరాధ తదితరులు అడిగిన ప్రశ్నకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు సభ్యుల నినాదాల మధ్యే సమాధానం ఇచ్చారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరు నాగేశ్వరరావు జోక్యం చేసుకుంటూ ప్రభుత్వం అన్ని విషయాలపై చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉందని, సభ్యులు సంయమనం పాటించాలని, సహకరించాలని పదేపదే విజ్ఞప్తి చేశారు. సభ్యులు శాంతించకపోవడంతో సభను చైర్మన్ వాయిదా వేశారు.

నిరసనల మధ్య ప్రశ్నోత్తరాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శాసన మండలిలో గురువారం నిరసనల మధ్య ప్రశ్నోత్తరాల సమయం కొనసాగింది. మంత్రులు పదేపదే సర్ది చెప్పినప్పటికీ సభ్యులు వెనక్కి తగ్గలేదు. విరామం అనంతరం సభ మధ్యాహ్నం ప్రారంభం కాగానే చైర్మన్ పోడియాన్ని వదలకుండా అక్కడే నిలబడి నినాదాలు చేస్తున్న సభ్యులను ఉద్దేశించి పెద్దల సభ గౌరవం కాపాడాలని, సభ నిర్వహణకు సహకరించాలని మంత్రులు సూచించినప్పటికీ విరమించలేదు. ఈ సమ యంలో మిగిలిపోయిన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు ఇచ్చి నట్టుగా భావిస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు. ప్రత్యేక ప్రస్తావనలో సభ్యులు షేక్ షాబ్జీ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానం అమలును చాలా రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపివేసి పాత పెన్షన్ పథకం తిరిగి అమలు చేస్తున్నాయని చెప్పారు. పాదయాత్రలో సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ అమలు చేస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అప్పటికీ సభ్యులు నినాదాలు చేయడం ఆపకపోయేసరికి మంత్రి జోగి రమేశ్ మాట్లా డుతూ, అన్ని అంశాల పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కావాలని రాద్ధాంతం చేయడం సబబు కాదని, సభ నిర్వహణకు సహకరించాలన్నారు. అనంతరం 10 నిము షాల పాటు వాయిదా ప్రకటించారు. మధ్యాహ్నం 1-10 నిముషాలకు మండలి తిరిగి ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆ సమయంలో పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు ప్రభుత్వానికి స్పెషల్ మెన్షన్ చేస్తున్న సమయంలో గందర గోళం నెలకొంది. దీంతో సభను రేపటికి వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ ప్రకటించారు.

బ్రిక్స్ సదస్సుకు ఏఐటీయూసీ నేత రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖ: దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో ఈనెల 26, 27 తేదీలలో జరిగే బ్రిక్స్ దేశాల ట్రేడ్ యూనియన్ల ఫోరం సదస్సుకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ (ఏఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ హాజరుకానున్నారు. ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ నుంచి ఈ మేరకు సందేశం అందింది. సదస్సుకు బ్రిక్స్ దేశాల ట్రేడ్ యూనియన్ల నేతలు హాజరుకానున్నారు.ఆర్థికాభివృద్ధి, నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల సృష్టి, కార్మికులకు మంచి ఆదాయం తదితర అంశాలపై చర్చ జరుగుతుంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సాగే పోరాటం, దేశంలో ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి అంశాలను బ్రిక్స్ దేశాల సదస్సులో చర్చించనున్నారు. 23వ తేదీన విశాఖపట్నం విమానాశ్రయం నుంచి రామకృష్ణ బయలుదేరి వెళతారు. ఆయనకు అనేకమంది అభినందనలు తెలిపారు.

బావ కోసం బాలకృష్ణ ఫీట్లు

మంత్రి రోజా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో రౌడీలు, గూండాల్లా వ్యవహరించారని, బావ కోసం బాలకృష్ణ ఫీట్లు వేశారని స్థానానికి ఏమాత్రం గౌరవం ఇవ్వకుండా నీచంగా ప్రవర్తించారన్నారు. పోడియం పైకి ఎక్కి, ఆయన చుట్టూ చేరి పేపర్లు చింపి మొఖాన విసిరారని మండిపడ్డారు. స్పీకర్ ఎదుటనున్న మానిటర్‌ను లాగేస్తూ, వారి మంచినీళ్ల గ్లాసును ఎత్తి పడేసి పగుల కొట్టారని, సభా సంప్రదాయాన్ని పాటించకుండా రచ్చ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణ దృష్టిలో అసెంబ్లీ అంటే సినిమా షూటింగ్ అనుకుంటున్నాడేమో, ఆయన నిండు సభలో మీసం మెలేసి తొడగొడట్టమేంటి..?, అని ప్రశ్నించారు. బాలకృష్ణ మీసం మెలేసి తొడ కొడితే ఇక్కడ భయపడే వాళ్లెవరూ లేరని, నాతోపాటు తొమ్మిదేళ్లుగా బాలకృష్ణ కూడా ఎమ్మెల్యేగా ఉన్నారని వివరించారు. హిందూపురం నియోజకవర్గం గురించి గానీ.. అక్కడ ప్రజల గురించికానీ, ఏరోజూ పట్టించుకోని బాలకృష్ణ, బావ కళ్లల్లో ఆనందం చూడటానికి తెగ ఆరాట పడుతున్నాడని విమర్శించారు. బాబు అరెస్టుపై చర్చిస్తామంటే, టీడీపీ రివర్స్‌డ్రామా లాడుతోందని దుయ్యబట్టారు. కేవలం జనాల్లో ప్రచారం కోసమే టీడీపీ నేతలు అసెంబ్లీకొచ్చి హడావుడి చేస్తున్నారనేదీ అర్థమౌతోందని రోజా స్పష్టం చేశారు.

ఏఓబీ... ఉద్రిక్తం

- జల్లెడపడుతున్న పోలీసులు
- బాంబ్ స్క్వాడ్‌లతో తనిఖీలు
- సరిహద్దు ప్రజల భయాందోళన

విశాలాంధ్ర-సీలేరు (అల్లూరి జిల్లా): సీపీఐ మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు(ఏఓబీ)లో భయానక వాతావరణం నెలకొంది. గురువారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవాల సందర్భంగా మావోయిస్టు పార్టీ కొత్త కేడర్ రిక్రూట్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తునట్లు ప్రచారం జరుగుతోంది. వారోత్సవాలను విజయవంతం చేయాలని ఏఓబీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి గణేశ్ ఇప్పటికే మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మారుమూల గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచడానికి మావోయిస్టులు సిద్ధమయ్యారు. మరోవైపు, మావోయిస్టుల కార్యకలాపాలను భగ్నం చేసేందుకు పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో సీఆర్పీఎఫ్ సహా భారీగా బలగాలు మోహరించాయి. బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు ముమ్మరం చేశారు. పోలీసు ఉన్నతాధికారుల, నిఘావర్గాల హెచ్చరికల మేరకు సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీలేరు ఎస్ఐ జె.రామకృష్ణ అధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సీలేరు నుంచి చిత్రకొండ జంక్షన్ వరకు గల అంతర్రాష్ట్ర రహదారిని జల్లెడ పట్టారు. బాంబు స్క్వాడ్ బృందాలతో రహదారిని, కల్వర్టులను తనిఖీ చేశారు. చిత్రకొండ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతోంది. సరిహద్దు గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ సరిహద్దు గ్రామాల ప్రజలను కోరారు. పోలీసుల కూంబింగ్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని సరిహద్దు గ్రామాల ప్రజలు భయపడుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డా.విజయకుమార్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన ప్రముఖ డాక్టర్ విజయ్ కుమార్ తన అనుచరులతో కలిసి గురువారం విజయవాడలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సమక్షంలో పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు సౌదీ అరేబియాలోనూ మంచి డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన విజయ్ కుమార్ పార్టీలో చేరడం శుభ పరిణామమని గిడుగు రుద్రరాజు వ్యాఖ్యానించారు. విజయకుమార్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా తనకు అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తానని, కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఉమ్మడి కడప జిల్లా మైదకూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల నుంచి కూడా 10 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ సాకే శంకర్ అధ్వర్యంలో, మాలమహానాడుకు చెందిన జి.వెంకటరమణ, పి.మహేశ్, ఎస్.వెంకటరమణ, పి.మనోహర్, కె.గంగులయ్య, హెచ్.రాజేశ్, శిఖామణి, వెంకటేశులు, ఎ.శ్రీనివాసులు, ఆర్‌కే కిశోర్‌కు రుద్రరాజు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మహిళా రిజర్వేషన్లు అందని ద్రాక్షే!

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఆమోదించడం హర్షదాయకమే అయినా అది అందని ద్రాక్ష పండుగానే మిగిలిపోక తప్పని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ బిల్లు ప్రవేశపెట్టి తాము మహిళలకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం టముకు వేసుకుంటోంది. బిల్లు ఆమోదించడంతో దాదాపు మూడు దశాబ్దాల ఆకాంక్ష నెరవేరుతుందన్న ఆశ ఉన్నా అది అమలులోకి రావడానికి కనీసం 2034 దాకా వేచి ఉండక తప్పదు. అందువల్ల ఇది 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ వంచి పెడ్తున్న తాయిలంగానే మిగిలిపోక తప్పదు. 1996లో సోషలిస్టు నాయకురాలు ప్రమీలా దండవతే మొట్టమొదటి సారి ప్రైవేటు మెంబెర్ బిల్లు ప్రవేశ పెట్టినప్పటి నుంచి ఈ అంశం నానుతూనే ఉంది. ఆ తరవాత సీపీఐ నాయకురాలు గీతా ముఖర్జీ నాయకత్వంలోని పార్లమెంటరీ కమిటీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది. అన్ని రాజకీయ పార్టీలూ ఈ బిల్లుకు సూత్ర ప్రాయంగా అనుకూలత వ్యక్తం చేసినా ఆచరణలో అడుగడుగునా ఆటంకాలు తప్పలేదు. ఈ బిల్లును ఆమోదించడం అంటే ఆకాశంలో సగం అనుకునే మహిళలకు రాజకీయ హక్కుని చట్టబద్ధం చేయడమే. సిద్ధాంత రీత్యా మహిళలకు ఈ హక్కు ఉండాలన్న అంగీకారం అయితే కుదిరింది. ఈ బిల్లును బుధవారం లోకసభ ఆమోదించినప్పుడు 454 మంది అనుకూలంగా ఓటు వేశారు. కేవలం ఇద్దరు మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇందులో ముస్లిం మహిళలకు రిజర్వేషన్ సదుపాయం లేనందువల్ల మజ్లిస్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకంగా ఓటు వేశారు. మహిళలను అపారంగా గౌరవిస్తామని, స్త్రీ అంటే లక్ష్మి, సరస్వతి అన్న స్తోత్ర పాఠాలు అనునిత్యం వింటూనే ఉంటాం. కానీ రాజకీయంగా ఇప్పటికి మహిళలకు దక్కింది నామ మాత్రమే. బిల్లుపై చర్చ జరిగినప్పుడు ప్రతిపక్షాలు ఇందులోని లోపాలను విస్తారంగానే ఎత్తి చూపాయి. కానీ ఇప్పుడు ఆమోదించే అవకాశం ఉన్నందువల్ల ఆ లోపాల కారణంగా బిల్లు ఆమోదానికి అడ్డు చెప్పలేదు. కనీసం సవరణలూ ప్రతిపాదించలేదు. అంటే ప్రతిపక్షాలు సంపూర్ణంగా సహకరించాయి. ఈ బిల్లు ఆమోదం పొందినందుకు సర్వత్రా ఆనందం వెల్లివిరియాల్సింది. కానీ అది ఎక్కడా కనిపించలేదు. కారణం ఏమిటంటే ఈ రిజర్వేషన్లు అమలులోకి రావడానికి దశాబ్దం కన్నా ఎక్కువ కాలమే పట్టొచ్చు. అంటే ఎప్పుడు దక్కుతాయన్నది ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఎవరికి వీటివల్ల ఫలితం ఉంటుంది అన్న ప్రశ్నకైతే పూర్తిగా అసంతృప్తికరమైన సమాధానమే వస్తోంది. ఎందుకంటే ఇందులో ఇతర వెనుకబడిన వర్గాలకు (ఓబీసీ) రిజర్వేషన్ల సదుపాయం లేదు. 2010లో ఈ బిల్లు రాజ్యసభ ఆమోదించినా లోకసభ ఆమోదం పొందకపోవడానికి ప్రధాన కారణం ఇదే. 13ఏళ్ల తరవాత కూడా మోదీ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. నిజానికి పట్టించు కోదలచుకోలేదు. 1998, 1999 లోనూ ఇదే ప్రధాన అడ్డంకి అయింది. దేశ జనాభాలో 50 శాతం పైగా ఓబీసీలు ఉన్నారు. మహిళల సంగతి ఎలా ఉన్నా ఓబీసీ పురుషులకు కూడా చట్టసభల్లో జనాభాకు తగ్గ ప్రాతినిధ్యం లేదు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వెంటనే అమలులోకి రావు అన్న అంశం బిల్లులోనే స్పష్టంగా ఉంది. అంటే మొదట జనాభా లెక్కలు పూర్తి కావాలి. ఆ తరవాత నియోజకవర్గాల పునర్విభజన జరగాలి అన్న షరతు పెట్టారు. 2010లో రాజ్యసభ ఆమఒదించిన బిల్లులో ఈ షరతులు లేవు. అలాగే అప్పుడు ఆమోదించిన బిల్లులో ఒక ఎన్నికల్లో మహిళలకు ఒక స్థానం రిజర్వు చేస్తే తరవాతి ఎన్నికలలో మరో స్థానం రిజర్వు అవుతుంది అన్న మాట ఉంది. అంటే రొటేషన్ పద్ధతి అమలు అవుతుంది. కానీ ప్రస్తుతం ఆ మాట లేదు. నియోజకవర్గాల పునర్విభజన తరవాతే రొటేషన్ పద్ధతి అమలులోకి వస్తుందట. ఈ పునర్విభజన పదేళ్లకు ఒకసారి జరగాలి. కానీ దశాబ్దాలు పట్టోంది. 2001 జనాభా లెక్కలు జరిగాయి. కానీ నివేదిక 2007లో వచ్చింది. అంటే జనాభా లెక్కల తంతు పూర్తి అయ్యేటప్పటికి అయిదారేళ్లు కనీసం పడుతోంది. నియోజకవర్గాల పునర్విభజన తక్షణం సాధ్యమయ్యేది కాదు. వాజపేయి నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2026 తరవాతే పునర్విభజన అన్న ఆంక్ష పెట్టారు. ఈ నిర్ణయం రాజ్యాంగ సవరణ కనక 2027 లో పని ప్రారంభించినా పునర్విభజన పూర్తయ్యే సరికి చాలా సమయం పడుతుంది. అంటే 2034 కన్నా ముందు ఈ రిజర్వేషన్లు అమలయ్యే ఆశే లేదు.

ఓటు వేసే మహిళల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 1962లో కేవలం 46 శాతం మంది మహిళలే ఓటు వేస్తే 2019లో అది 66 శాతానికి పెరిగింది. అయినా పార్లమెంటులో ఉన్న మహిళు 15శాతం మాత్రమే. ఉభయ సభల్లోనూ కలిపి బీజేపీ ప్రతినిధులుగా ఉన్న మహిళలు 14 శాతమే. మోదీ ఉద్దేశం బిల్లు, దానివల్ల కలిగే ప్రయోజనం కాదు. తన ప్రచారమే ఆయనకు అన్నింటికన్నా ముఖ్యం. మోదీ ప్రభుత్వానికి లోకసభలో సంపూర్ణమైన మెజారిటీ ఉన్నా ఓబీసీలకు, ముస్లింలవంటి అల్పసంఖ్యాక వర్గాల వారికి రిజర్వేషన్లు వర్తింప చేయలేదు. ముస్లింలకు ఇప్పుడూ లేవుగా అని వాదించవచ్చు. కానీ అల్ప సంఖ్యాక వర్గాల ప్రాతినిధ్యానికి ప్రత్యేక ఏర్పాటు అవసరం. ఈ విషయాన్ని మోదీ ప్రభుత్వం గుర్తించడమే లేదు. ఓబీసీలకు రిజర్వేషన్లు లేని మహిళా బిల్లు నిష్ప్రయోజనకరంగా మిగిలిపోతుంది. మహిళలు ఇప్పటికీ అనేక రకాలుగా వెనుకబడే ఉన్నారు. ఇలాంటి స్థితిలో రాజకీయాధికారం ఈ పరిస్థితిని మార్చడానికి ఉపకరిస్తుంది. ప్రతి అంశాన్ని మహాద్భుతమైన ఘట్టంగా ప్రచారం చేసే మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కూడా అదే గతి పట్టించింది. తన మాయాజాలం ప్రదర్శించడానికి మోదీ మంగళవారం పాత పార్లమెంటులో, ఆ తరవాత కొద్ది సేపటికే కొత్త పార్లమెంటులో సుదీర్ఘంగా, గంభీరంగా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించారు. అయిదు రోజులపాటు జరగవలసిన పార్లమెంటు సమావేశాలు ప్రధానమంత్రి ప్రసంగాల ప్రత్యేక సమావేశాలలాగా తయారయ్యాయి. మొదటి రోజు సమావేశాలను మోదీ తరగతి గదిలా మార్చేశారు. ప్రత్యేక సందర్భాలలో మినహా మిగతా సమయాల్లో ప్రధానమంత్రి పార్లమెంటులో అడుగే పెట్టరు. ఈ లోకసభ తొమ్మిదన్నరేళ్ల కాలంలో ప్రధానమంత్రి మాత్రమే సమాధానం చెప్పవలసిన సందర్భాలలో తప్ప కేవలం రెండు సార్లు మాత్రమే సమాధానం చెప్పారు. హిందీలో పేర్లు పెట్టడంలో అపారమైన చాతుర్యం సంపాదించిన కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లుకు కూడా నారీ శక్తి వందన్ అని నామకరణం చేశారు. పేర్లు పెట్టడంలో దిట్ట కనక పాత పార్లమెంటును ఇక మీదట సన్సద్ సదన్ అనాలని ప్రకటించారు. ఈ విషయంలో ఆయన ఎవరితోనూ చర్చించరు, సంప్రదించరు. ప్రకటించేస్తారు. దేశమంతా ఆ మాటను అంగీకరించి తీరవలసిందే.

ఆకలి కేకల భారతం

ఆకలి సమస్య బహు క్లిష్టం, అనారోగ్య కారణం, ప్రాణాంతకం, అభివృద్ధి నిరోధకం. ఆకలిని నిర్వచించి, వివరించడానికి అనేక కొలమానాలు ఉన్నాయి. శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం సరిగ్గా లభించని, పోషకాహారలోప దుస్థితిని ఆకలిగా చెప్పవచ్చు. ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న పేద దేశాల మానవాళి ఆకలి కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. ఆకలి సూచీలో భారతదేశం దిగువన ఉండడం విచారకరం. 121 దేశాల ప్రపంచ ఆకలి సూచీ(జిహెచ్ఐ) జాబితాలో భారతదేశం 107వ స్థానంతో ఉండడం గమనించారు. శ్రీలంక(64), బంగ్లాదేశ్(84), నేపాల్(81), పాకిస్థాన్(99), నైజీరియా(103) దేశాల కన్న భారత్ స్థానం దిగువన నిలవడం విచారకరం. అంతర్జాతీయ సంస్థ ప్రకటించిన జిహెచ్ఐ సూచీ కొలమానాలు సరిగా లేవని, భారత ప్రభుత్వం ఘాటుగా విమర్శించి ఒక ప్రకటనను విడుదల చేసింది. ప్రపంచ ఆకలి సూచీ-2021 ప్రకారం 116 దేశాల జాబితాలో భారతం 101 వ స్థానంలో నిలవడం జరిగింది. 2021 సూచీతో పోల్చితే 2022 లో భారత స్థానం 101 నుంచి 107కు పడిపోవడం మన ప్రభుత్వ సామర్థ్యం ఎంతో తెలియజేస్తుంది.

ప్రపంచ ఆకలి సూచీ ప్రమాణాలను ఉపయోగించి భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ఆకలి సూచీ(ఎస్‌హెచ్ఐ)లను కూడా 2019-20లో నిర్ణయించి అధ్యయన ఫలితాలను విడుదల చేసారు. రాష్ట్రాల ఆకలి సూచీ, ఎస్‌హెచ్ఐ స్కోరు 0 నుంచి 100 వరకు ఉంటుంది. అధిక స్కోరు అధిక ఆకలిని సూచిస్తుంది. ఎస్‌హెచ్ఐ స్కోరు 0 - 10 స్థితిని స్వల్ప ఆకలిగా, 10 - 20 స్కోరును ఒక మోస్తారు ఆకలిగా, 20 - 30 స్కోరును తీవ్రమైన లేదా సీరియస్ ఆకలిగా, 30 - 40 స్కోరును ఆందోళనకరమైన ఆకలిగా, 50 దాటితే మిక్కిలి/అత్యధిక ఆందోళనకరమైన లేదా ఎక్స్‌ట్రీమ్లీ అలార్మింగ్ ఆకలిగా అభివర్ణిస్తారు. సగటు భారత ఆకలి సూచీ విలువను 29.7 స్కోరుగా సీరియస్ ఆకలి స్థాయిగా నిర్ణయించారు.

రాష్ట్రాల్లో అత్యధిక 35 స్కోరుతో బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు అత్యధిక ఆకలి సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తున్నది. ఎస్‌హెచ్ఐ స్కోరు 29.7 స్థాయిలో గుజరాత్, యూపీ, ఎంపీ, త్రిపుర, మహారాష్ట్ర ప్రాంతాల్లో సీరియస్ స్థాయిలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. భారత ఆకలి సూచీ స్కోరు 29.7 కన్న తక్కువ స్కోరుతో ఇతర రాష్ట్రాలు జాబితాలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్(29.4), తెలంగాణ(28.9), కర్నాటక(27.0), ఏపీ(23), హర్యానా(22.4), లక్షద్వీప్(20.8) స్కోర్లతో 20 - 29.7 మధ్య సీరియస్ ఆకలి స్థాయిలో 14 రాష్ట్రాలు నిలవడం గమనించవచ్చు. అతి తక్కువ ఆకలి కేకలతో ఛండీఘడ్(12.4) ఉన్నత స్థాయిలో ఉన్నది. సిక్కిమ్(14.8), పుదుచ్చేరి(15.2), కేరళ(15.7), మణిపూర్(16.3) మిజోరామ్(17.1), పంజాబ్(17.2), ఢిల్లీ(18.1), అరుణాచల్(18.3), అండమాన్-నికోబార్(18.8), తమిళనాడు(19.7) స్కోరును పొంది ఒకమాదిరి ఆకలి కేకలను అనుభవిస్తున్నాయి. తక్కువ ఆకలి సమస్యతో 0 - 10 స్కోరును కలిగిన రాష్ట్రం ఒక్కటి కూడా లేకపోవడం విచారకరం.

భారతంలో ఆహార దిగుబడులు అవసరం కన్న మిన్నగా వస్తున్నాయని, గోదాముల్లో మిగులు ఆహార ధాన్యాలు మూలుగుతూ ఎలుకలకు అందుబాటులో ఉంటున్నాయని, పటిష్ట ప్రజాపంపిణీ వ్యవస్థలతో నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేయడం, పనికి ఆహార పదార్థాలు పంపిణీ చేయడం జరిగినప్పటికీ ఆహార అభద్రత మన పౌర సమాజాన్ని వెంటాడుతూనే ఉన్నది. ఆహార భద్రత మాత్రమే సరిపోదని, పోషకాహార భద్రత మాత్రమే భవిష్యత్తు తరానికి ఆరోగ్య భాగ్యం ప్రసాదిస్తుందని పాలకులు అర్థం చేసుకోవాలి. పోషకాహారం రెండు పూటల అందిననాడు మాత్రమే ఆరోగ్య భారతం నిర్మితం అవుతుందని, పోషకాహారమే మహా ఆరోగ్య ప్రదాత అని తెలుసుకొని ఆ దిశగా ప్రభుత్వాలు, సామాన్య జనాలు పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. నేటి పిల్లలకు పోషకాహారం అందిస్తేనే భవిష్యత్తు యువభారతం దేశాభివృద్ధిలో ముందంజలో ఉంటుంది.

దా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

రిజర్వేషన్‌కు గీతాముఖర్జీ అవిరళ కృషి

వినయ్‌విశ్వం
సీపీఐ కార్యదర్శి, ఎంపీ

సుదీర్ఘ కాలం పోరాడిన తరువాత మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనేత, పార్లమెంటు సభ్యురాలు చేసిన సుదీర్ఘ పోరాటానికి ఫలితం లభించింది. ఈ సందర్భంగా గీతాముఖర్జీని గుర్తు చేసుకుంటూ నేటి పార్లమెంటు సభ్యులంతా ఆమెకు నివాళులర్పించాలి. మహిళా హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన మనం మరువలేని నాయకురాలు ఆమె. మహిళల విముక్తి పరిపూర్ణం కాకుండా భారతదేశంలో విప్లవ సాధన లక్ష్యం నెరవేరదని నమ్మిన నాయకురాలు గీతాముఖర్జీ. ఈ దిశలో ముందుగా పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆమె ప్రభుత్వాలను డిమాండ్ చేసి చట్టం కోసం ఎన్నో పోరాటాలు జరిపారు. అనేక దశాబ్దాల పాటు ప్రజాస్వామ్య శక్తులు రిజర్వేషన్‌ల కోసం పోరాడాయి. నేడు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళా సంఘాలు ఇతర ప్రజాస్వామ్య శక్తుల భవిష్యత్ పోరాటాలకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుంది. దేశంలో మహిళా సాధికారత కల్పించటానికి తామే కారణమని, ఈ ఘనత తమదేనని చెప్పుకునేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది తమ గొప్పతనమని చాటుకునేందుకు ప్రభుత్వం తహతహలాడుతోంది. మహిళా హక్కుల పోరాట యోధులం తామే అని ప్రచారం చేసుకోవటానికి సిద్ధం అయింది. అయితే రిజర్వేషన్ బిల్లును చట్ట రూపంలోకి తీసుకురావటానికి ప్రధాని మోదీ, ఆయన పార్టీ చిత్తశుద్ధితో చేసినదేమీ లేదు. రాజకీయంగా సిద్ధాంతపరంగా మహిళా సాధికారతకు వీరు వ్యతిరేకం. ఆర్ఎస్ఎస్ మహిళలకు సభ్యత్వాన్ని కూడా ఇవ్వలేదు. బీజేపీ ఈ సంస్థ నియంత్రణలోనే పనిచేస్తుంది. వీరు రాజకీయంగా, సిద్ధాంతపరంగా మహిళా సాధికారతకు వ్యతిరేకులు. మహిళలకు స్వేచ్ఛ అవసరం లేదన్న మనుస్మృతి ఈ శక్తులకు మార్గదర్శి. అకస్మికంగా ఒక్కసారిగా నారీశక్తిని గుర్తించినట్టు, వారికి హక్కును కల్పించేందుకే ఈ చట్టం తీసుకువస్తున్నామని చెప్పుకొంటున్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఈ బిల్లు గురించి ఏనాడూ మాట్లాడలేదు.

మహిళా రిజర్వేషన్‌ల బిల్లును యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం 1996 లో రూపకల్పన చేసింది. ఈ ప్రభుత్వంలో సీపీఐ ముఖ్యమైన స్థానాలలో పనిచేసింది. ఆనాడు ఒబీసీల రిజర్వేషన్‌లకు సంబంధించి తేడాలు రావటంతో ఈ బిల్లును ఆమోదించలేకపోయారు. ఆ సమయంలోనే గీతాముఖర్జీ నాయకత్వంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అత్యంత వేగంగా పనిచేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది. అయితే లోకసభ రద్దు కావడంతో ఈ బిల్లుకు కాలం చెల్లింది. వాజ్‌పేయి ప్రభుత్వంలోను ఈ విషయంలో చెప్పుకోదగిన పురోగతి జరగలేదు. యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు ఉండి మహిళల రిజర్వేషన్ చట్టం కోసం తీవ్రంగా కృషి చేశాయి. కనీసం ఉమ్మడి కార్యక్రమంలో కూడా మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రముఖ స్థానాన్ని కల్పించారు. 2008 మే 6వ తేదీన మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. స్థాయీ సంఘం పరిశీలన అనంతరం 2010 మార్చి 9న ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించింది. అనంతరం రాజకీయ అస్థిరతల కారణంగా ఈ అంశం విషయంలో పురోగతి

జరగలేదు. మహిళా రిజర్వేషన్ చట్టం కోసం సీపీఐ, ఇతర వామపక్ష పార్టీలు ఎల్లవేళలా అంకిత భావంతో పోరాడాయి. ప్రగతిశీల మహిళా సంఘాలు ఈ విషయంలో దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపాయి. జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఈ అంశంపై ప్రజా ప్రయోజనాల పిటిషన్‌ను 2021లో సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. సుప్రీంకోర్టు సైతం ఈ అంశానికి ప్రాధాన్యతను ఇచ్చి ఈ బిల్లును ఆమోదించకుండా జాప్యం చేస్తే తీవ్ర పర్యవసానాలు ఉంటాయని ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది. 2024లో లోకసభ ఎన్నికలు ఇంకా ఇతర అంశాలు బీజేపీ ప్రభుత్వం చట్టం చేయడానికి ముందుకు వచ్చింది. ఈ విషయంలో బీజేపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోయినప్పటికి అవపరం కొద్దీ చట్టం చేయడానికి సిద్ధపడింది. జన గణన, నియోజక వర్గాల పునర్విభజన అంశాలను సాకుగా చూపి ఇప్పుడే అమలు చేయకుండా వాయిదా వేసింది. అమలులో జాప్యం చేయకండా నిరోధించాలి. ప్రస్తుత లోకసభ రద్దుకాక ముందు బిల్లును చట్టంగా తీసుకురావాలని వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

ఇప్పటకే పంచాయితీలు, మున్సిపాలిటీలలో మహిళలకు 33 శాతం నుంచి 50 శాతం వరకు రిజర్వేషన్ కల్పించిన అనుభవమున్నది.దీనివత్త దేశ రాజకీయ చిత్రంలో సానుకూలమైన మార్పులు సంభవించాయి. ఇది మనం చూస్తూనే ఉన్నాం. మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టంగా తీసుకువస్తే రాజకీయ రంగంలో స్త్రీ, పురుషులకు ఒకేవిధమైన స్థానం కల్పించాలన్న ఆశయం నెరవేరతుంది. ఈ చట్టాన్ని రాజ్యసభకు, రాష్ట్రాల శాసనసభలు, శాసన మండలులకు , కేంద్రపాలిత ప్రాంతాలకు విస్తరింపజేయాలి. ఒబీసీలు, మైనారిటీలకు రిజర్వేషన్‌లు చట్టసభలలో కల్పించటం ద్వారా ప్రజాస్వామ్యం అర్థవంతమైనదిగా కొనసాగుతుంది. గీతాముఖర్జీ కమిటీ ఈ విషయాన్ని కూడా నివేదికలో పేర్కొన్నది. ఇది తమ ఘనత అని తప్పెట కొట్టుకుంటున్న బీజేపీ నేతలు ఇంతవరకు ఈ బిల్లును ఏనాడు ఆలోచించలేదు. ఇప్పుడు కూడా నారీశక్తి పేరుతో అధికారం దక్కించుకోవాలన్నదే వారి లక్ష్యం. సామాజిక న్యాయం కోసం మహిళలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని రాజకీయ, సిద్ధాంత అజెండాలో లేదు. ఇది ప్రజలందరికీ తెలిసిందే. ఈ ఘనత పోరాడిన మహిళలకు చెందుతుంది. మహిళా విముక్తి కోసం, న్యాయం కోసం పోరాడిన మహిళలు, ఇతర ప్రజాస్వామ్య శక్తులకు కమ్యూనిస్టులు అండదండగా నిలిచారు.

కొనసాగుతున్న కుంభకోణాల పరంపర!

బొల్లిముంత సాంబశివరావు

సామ్రాజ్యవాదుల ఆశీస్సులతో, జాతీయ విధానాల ప్రచారంతో 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్ డీ ఏ కూటమి విజయం సాధించి మోదీ ప్రధాన మంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయత, జాతీయ విధానాలు పక్కనపెట్టి సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలే ముఖ్య కర్తవ్యంగా ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను ప్రైవేటీకరణకు, అమ్మకాలకు పూనుకున్నాడు. అవినీతికి పాల్పడలేదంటూనే అనేక అవినీతి కుంభకోణాలకు అవకాశం కల్పించాడు.

స్కిల్ డవలప్‌మెంట్‌లో జరిగిన అవినీతికి మూలం చంద్రబాబేనని, ఆయనపై సిఐడి కేసు పెట్టి అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. వారం రోజుల నుండి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలకు చంద్రబాబు అరెస్టు వార్తలు తప్ప ప్రజల సమస్యలు పట్టలేదు. పాలక పార్టీల నాయకులకు, మంత్రులకు కుంభకోణాలు కొత్తేమి కాదు. ప్రథమ ప్రధాని నెహ్రూ ప్రభుత్వం కుంభకోణాలకు మినహాయింపు కాదు. అప్పుడు అధిక ధరలకు జీబుల కొనుగోలు కుంభకోణంతో పాటు హరిదాస్ ముద్రా కుంభకోణం, ప్రతాప్ సింగ్ కైరాన్ కుంభకోణం, తేజాలోన్ అవినీతి కుంభకోణం మొదలైనవి జరిగాయి. ఇందిరాగాంధి పాలనలోనూ కొన్ని కుంభకోణాలు జరిగాయి. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు బోఫోర్స్ కుంభకోణం పెద్ద సంచలనం సృష్టించింది. భారత్, స్వీడన్ మధ్య జరిగిన 1.4 బిలియన్ దాలర్ల ఆయుధాల కొనుగోలు ఒప్పందం అది. ఇందులో ముడుపుల చెల్లింపు బయటకు వచ్చి రాజీవ్‌గాంధి ప్రభుత్వం సంక్షోభంలో పడింది. నిజాయితీ పరుడని ప్రారం జరిగిన వాజ్ పాయ్ ప్రభుత్వ పాలన కూడా కళంక భరితంగానే ఉంది.

పీవీనరసింహరావు ప్రభుత్వంలో కుంభకోణాల పరంపర కొనసాగింది. అందులో జార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి ఒకటి. పార్లమెంట్‌లో మెజారిటీ కోసం ముక్తి మోర్చా సభ్యులకు ముడుపులు చెల్లించారన్నది. ఈ ఆరోపణలపై ప్రత్యేక కోర్టు విచారణ జరిపి 29-9-2000న పీవీని దోషిగా తీర్పు ఇచ్చింది. మరొకటి సెయింట్ కిట్ కేసు: భోఫోర్స్ అవినీతిపై రాజీవ్‌గాంధీతో విభేదించి పార్టీ నుంచి విపిసింగ్ బయటకు వచ్చారు. ఆయన్ను అప్రతిష్ట పాలుచేసేందుకు ఫోర్జరీ సంతకాలతో విపిసింగ్ కుమారుని పేరుతో బ్యాంకు ఎకౌంట్ సృష్టించారు. లఖుబాయ్ పాఠక్ కేసు- లఖుబాయ్ పాఠక్ అనే పచ్చళ్ల వ్యాపారి పీవి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునేందుకు పీవీకి సన్నిహితుడైన చంద్రస్వామికి డబ్బులు ఇచ్చాడనేదే ఈ కేసు. ఈ రెంటిలో రాజకీయ పలుకుబడి మూలంగా కోర్టుల్లో పీవీకి అనుకూలంగా తీర్పులు వచ్చాయి.

2004 ఎన్నికల్లో యూపీఏ కూటమి విజయం సాధించి నాటకీయంగా మన్మోహన్‌సింగ్ ప్రధాని అయ్యాడు. అవినీతి లేని వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఈయన ప్రభుత్వం అనేక కుంభకోణాలకు నిలయమైంది. వాటిల్లో అతి ముఖ్యమైనవి బొగ్గు కుంభకోణం, 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం. 2012లో బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వరంగ సంస్థలకు, ప్రైవేట్ కంపెనీలకు కేటాయింపుల్లో జరిగిన పెద్ద రాజకీయ కుంభకోణం. ప్రైవేట్ కంపెనీలకు అతి తక్కువ ధరలకు కేటాయింపుల వలన ప్రభుత్వ ఖజానాకు 10,673 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రచారం జరిగింది. 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం భారత రాజకీయ రంగాన్ని కుదిపి వేసింది. టెలికాం కంపెనీలకు 122.2జి లైసెన్స్‌ల కేటాయింపులో ప్రభుత్వానికి 30,984 కోట్ల నష్టం వాటిల్లిందని, అందుకు ఆనాటి టెలికాం మంత్రి రాజా అవినీతే కారణమని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. మంత్రి అరెస్టుతో పాటు రాజీనామా చేయకతప్పలేదు. రాజకీయ వత్తిళ్లతో సాక్ష్యాలను తారుమారు చేయటంతో కేసును ప్రత్యేక కోర్టు కొట్టివేయటం జరిగింది. యూపీఏ ప్రభుత్వ పాలనలో 4.8 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగినట్లు అభియోగాలు ఉన్నాయి.

ఇవేగాక 1992 నుండి 2009 వరకు కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ అనేక అవినీతి కుంభకోణాలు జరిగాయి. 1992లో హర్షద్ మెహతా 5వేల కోట్ల కుంభకోణం, 1994లో 650 కోట్ల చక్కెర దిగుమతి కుంభకోణం, 1996 లో 1300కోట్ల ఎరువుల దిగుమతి కుంభకోణం, 1997లో 1500 కోట్ల సుఖ్‌రామ్ టెలికాం కుంభకోణం, 1200 కోట్ల బిహార్ భూ కుంభకోణం, 1998లో 8వేల కోట్ల టేకు తోటల స్కామ్, 2001లో 4800 కోట్ల యుటిఐ కుంభకోణం, 1200 కోట్ల కేతన్ పరేఖ్ సెక్యూరిటీ స్కామ్, 2002లో సంజయ్ అగర్వాల్ హోమ్ ట్రేడ్ కుంభకోణం, 2003లో 172 కోట్ల తెలంగాణ స్టాంప్ స్కామ్, 2005లో 18,978 కోట్ల స్కార్పన్ సబ్ మెరైన్ కుంభకోణం, 2006లో 1500కోట్ల పంజాబ్ సిటీ సెంటర్ ప్రాజెక్టు కుంభకోణం, తాజ్ కారిడార్ కుంభకోణం, 2008లో 50వేల కోట్ల పూణె బిలియనీర్ హసన్ అలీ ఖాన్ పన్ను డిఫాల్ట్ స్కామ్, 10వేల కోట్ల సత్యం కుంభకోణం 71 వేల కోట్ల ఎస్ డబ్ల్యు సిఐఎల్ -2008 స్కామ్, 2009లో 2500కోట్ల బియ్యం ఎగుమతి కుంభకోణం, 7వేల కోట్ల ఒడిశా గనుల కుంభకోణం, 4వేల కోట్ల మధు కోడ మైనింగ్ కుంభకోణం జరిగిన కుంభకోణాల్లో ముఖ్యమైనవి. మోదీ ప్రభుత్వ పాలనలో: మోదీ రాజకీయమంతా మత విద్వేషాల రాజకీయం. గుజరాత్‌లో ఆయన పాలనలో జరిగిన మత విద్వేష మారణకాండ చరిత్ర ఎప్పటికీ మర్చిపోదు. యూపీఏ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత దృష్ట్యా అమెరికా సామ్రాజ్యవాదం, విదేశీ గుత్త పెట్టుబడిదారుల ఆశీస్సులతో, వారి కనుసన్నలలో ఉన్న అన్ని రకాల ప్రచార సాధనాలు మోదీని ఆకాశానికి ఎత్తి అద్వానికి ప్రత్యామ్నాయంగా ముందుకు తెచ్చాయి. మోదీ అయితే తమకు ఎక్కువగా సేవ చేస్తాడని సామ్రాజ్యవాదులు భావించటమే అందుకు కారణం.

సామ్రాజ్యవాదుల ఆశీస్సులతో, జాతీయ విధానాల ప్రచారంతో 2014 సాధారణ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్ డీ ఏ కూటమి విజయం సాధించి మోదీ ప్రధాన మంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యింది. అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయత, జాతీయ విధానాలు పక్కనపెట్టి సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలే ముఖ్య కర్తవ్యంగా ప్రభుత్వరంగ సంస్థలను, ఆస్తులను ప్రైవేటీకరణకు, అమ్మకాలకు పూనుకున్నాడు. అవినీతికి పాల్పడలేదంటూనే అనేక అవినీతి కుంభకోణాలకు అవకాశం కల్పించాడు. అందులో ఒకటి పెగాసస్ స్పైవేర్. 2017లో పెగాసస్ కోసం ఎన్ఎస్‌వో (ఇజ్రాయిల్) తో మోదీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. పెగాసస్‌ను ' మిలటరీ గ్రేడ్ "నిఘా సాఫ్ట్‌వేర్" గా పేర్కొంటారు. దీన్ని స్మార్ట్‌ఫోన్లు, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్ టాప్‌ల్లో రహస్యంగా ప్రవేశపెడతారు. వీటిని వాడే వ్యక్తులపై నిఘా ఉంటుంది. దీన్ని మోదీ ప్రభుత్వం దేశ ప్రజలపైనే ప్రయోగించింది. 200 కోట్ల ఆయుధ ఒప్పందంలో భాగంగా దీన్ని కొనుగోలు చేశారు. మరొకటి రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు: ఈ విమానాల కొనుగోలులో భారీ కుంభకోణం జరిగినట్లు ఆధారాలు ఉన్నా మోదీ ప్రభుత్వం దర్యాప్తునకు అంగీకరించలేదు. ఇది ఒక పెద్ద కుంభకోణం. అమెరికా నుండి 31 డ్రోన్‌ల కొనుగోలుకు భారతదేశం ఒప్పందం చేసుకుంది. ఈ డ్రోన్‌ల ఖరీదు 110 మిలియన్ల డాలర్లు. ఒక్కో డ్రోన్‌ను మోదీ ప్రభుత్వం 880 కోట్లకు కొనుగోలు చేస్తే, ఇతర దేశాలు అందులో నాలుగవ వంతుకే కొనుగోలు చేశాయంటే మోదీ ప్రభుత్వం అవినీతి ఏవిధంగా ఉందో వెల్లడౌతుంది. ఈ డ్రోన్‌లను విక్రయిస్తున్న కంపెనీ సిఇఓ మోదీ ప్రభుత్వతో సంబంధాలు కలిగి ఉన్నాడంటేనే ఎలా కుంభకోణం జరిగిందో అర్థమౌతుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం: ఇదీ మోదీ ప్రభుత్వ పాలనలోనే జరిగింది. ప్రభుత్వ బ్యాంక్ అయిన పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 11,400 కోట్ల కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణానికి ఆద్యుడు నీరవ్‌మోదీ. నీరవ్‌మోదీ, బ్యాంకు అధికారులు కుమ్మక్కై ప్రజల డబ్బును కొల్లగొట్టారు. అరెస్టు కాకుండా నీరజ్‌మోదీ లండన్ పారిపోయేందుకు మోదీ ప్రభుత్వం సహకారం అందించింది. ప్రజల డబ్బుతో నీరవ్‌మోదీ లండన్‌లో విలాస జీవితం గడుపుతున్నాడు. లండన్ నుండి ఆయన్ను ఇండియా తీసుకు రావటంలోనూ ఉద్దేశపూర్వకంగా మోదీ ప్రభుత్వం విఫలమైంది. దేశంలోనే అత్యంత దారుణమైన అతిపెద్ద వ్యాపం కుంభకోణం కూడా మోదీ ప్రభుత్వంలోనే జరిగింది.

సెల్:9885983526

మాకే నీళ్లు లేవు... మీకేమిస్తాం...

- కర్నాటకలో 'కావేరి' పోరు
- నది పరివాహక జిల్లాల్లో రైతు సంఘాల ఆందోళనలు

బెంగళూరు: కర్నాటకలో కావేరి జలాల వివాదం కొనసాగుతోంది. ఇటీవల తమిళనాడుకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని కర్నాటకకు కావేరి జల నిర్వహణ సంస్థ, కావేరి జల నియంత్రణ కమిటీ ఆదేశాలిచ్చింది. దీనిపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో కన్నడ రాష్ట్రంలోని నది పరివాహక జిల్లాల్లో గురువారం ఆందోళనలు జరిగాయి. రైతు సంఘాలు, కన్నడ అనుకూల సంఘాల అధ్వర్యంలో మైసూరు, మాండ్యా, బెంగళూరుతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. తమిళనాడుకు కావేరి జలాల విడుదలకు వెలువడిన ఆదేశాలపై కర్నాటక ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'విడుదల చేసేందుకు అసలు నీరెక్కడుంది? మేము న్యాయాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని నిరసనకారులు నినదించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్న కొద్దిపాటి నీళ్లు పక్క రాష్ట్రానికి ఇచ్చేస్తే మా పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కర్నాటక రాజ్యరైత సంఘ, హసిరు సెనే (రైతు సంఘం) అధ్వర్యంలో మైసూరులోని కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అధారిటీ కార్యాలయం ముట్టడికి యత్నించారు. కావేరి, కబిని బేసిన్ తాలుకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినట్లు రైతు నాయకులు గుర్తుచేశారు. తమిళనాడుకు అనుకూలంగా సీడబ్ల్యూఎంఏ ఉత్తర్వులు ఉన్నాయని, రిజర్వాయర్లలోని నీటి మట్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, కర్నాటక తాగు-సాగునీటి అవసరాలను పట్టించుకోకుండా ఆదేశాలు జారీ చేసిందని ఆరోపించారు. గాంధీనగర్‌లో కర్నాటక రక్షణ వేదిక అధ్వర్యంలో జరిగిన నిరసనలో సంస్థ అధ్యక్షుడు నారాయణ గౌడ మాట్లాడుతూ ఈ రోజు కర్నాటకకు బ్లాక్‌డే అని అన్నారు. కావేరి జల నిర్వహణ సంస్థ (సీడబ్ల్యూఎంఏ) ఆదేశాలను సమర్థిస్తూ... సుప్రీంకోర్టు మా ముఖంపై తలుపులు మూసేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను అర్థం చేసుకోకుండా వెలువడిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తామని చెప్పారు. రాష్ట్రంలో తాగునీటి కటకట ఉందని, నాలుగు డ్యామ్‌లలో నీళ్లు లేవని, పరిస్థితిని సమీక్షించేందుకు ఓ బృందాన్ని పంపమని సూచించామని చెప్పారు. నీళ్లే లేనప్పుడు విడుదల ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అయితే గౌడతో పాటు వేదికె కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసు వాహనాలు ఎక్కించి పోలీసు స్టేషన్లకు తరలించారు.

స్టాలిన్ మెప్పు కోసమే: బీజేపీ

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎంకే స్టాలిన్ (తమిళనాడు సీఎం) సహకారం కోసం వెంపర్లాడుతున్న కారణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రాష్ట్రానికి నీళ్లు ఇచ్చి కర్నాటక ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నేత, మాజీ మంత్రి ఆర్ అశోక విమర్శించారు. ఈ విషయంలో సీఎం సిద్దరామయ్యగానీ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌గానీ నోరు మెదపడం లేదన్నారు. కావేరి అంశంపై సిద్ధ సర్కార్ నిర్లక్ష్యంగా ఉందన్నారు.

మేము జోక్యం చేసుకోం: సుప్రీం

న్యూఢిల్లీ: కావేరి నది జలాల వివాదంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మధ్య నీటి వాటా క్రమంలో కావేరి జల నియంత్రణ కమిటీ, కావేరి జల నిర్వహణ సంస్థ చూసుకుంటాయని జస్టిస్ బీఆర్ గవై నేతృత్వంలోని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పీకే మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ప్రతి 15 రోజుల నీటి అవసరాలను పర్యవేక్షిస్తున్నాయని, వాటిని తీరుస్తున్నాయని సీడబ్ల్యూఆర్‌సీ, సీడబ్ల్యూఎంఏని ఉద్దేశించి పేర్కొంది. తమిళనాడుకు కర్నాటక ప్రతిరోజూ ఐదువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలన్న వాదన అనవసరమైనది కాదని వ్యాఖ్యానించింది. అన్ని అంశాలను, ముఖ్యంగా కరువు పరిస్థితులను సీడబ్ల్యూఆర్‌సీ, సీడబ్ల్యూఎంఏ పరిగణనలోకి తీసుకున్నాయని ధర్మాసనం తెలిపింది. కర్నాటక నుంచి 7,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని సీడబ్ల్యూఆర్‌సీ నిర్ణయించింది కానీ తర్వాత నిర్ణయాన్ని మార్చుకుంది. రోజుకు ఐదువేల క్యూసెక్కులను తమిళనాడుకు ఇవ్వాలని సూచించింది. ఈ విషయాన్ని తమిళనాడు తరపు న్యాయవాదులు ముకుల్ రొహత్గీ, జి.ఉమాపతి ప్రస్తావించారు. తమ వాదనలు వినిపించారు. బిలిగుండులు ప్రాజెక్టు వద్ద ఐదువేల క్యూసెక్కుల నీటి విడుదలకు సీడబ్ల్యూఆర్‌సీ ఆదేశాలను సీడబ్ల్యూఎంఏ ధృవీకరించినట్లు తెలిపారు. సీడబ్ల్యూఆర్‌సీ నిర్ణయాన్ని సీడబ్ల్యూఎంఏ యాంత్రికంగా ఆమోదించింది. రాష్ట్రంలో సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయలేదు' అని రొహత్గీ వాదించారు.

సారీ... నీళ్లు ఇవ్వలేం

షెఖావత్‌తో భేటీలో సిద్ధ, డీకే ప్రధాని జోక్యాన్ని కోరిన నాయకులు

న్యూఢిల్లీ: కావేరి జల నిర్వహణ సంస్థ (సీడబ్ల్యూఎంఏ) ఆదేశాలను పాటించలేమని, ఈ నెల 28వ తేదీలోగా తమిళనాడుకు 5వేల క్యూసెక్కుల కావేరి నీటిని విడుదల చేసే పరిస్థితిలో కర్నాటక లేదని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ దృష్టికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీకే శివకుమార్ తీసుకెళ్లారు. తమ రాష్ట్రంలో కరువు తరహా పరిస్థితి ఉందని చెప్పారు. తమిళనాడుకు నీటి విడుదలకు నిరసనగా రైతు సంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేసిన క్రమంలో షెఖావత్‌తో సిద్ధ, డీకే భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. నాలుగు రాష్ట్రాలు-కర్నాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరికి సంబంధించిన జలవివాదాన్ని పరిష్కరించడానికిగాను ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని శివకుమార్ కోరారు. సమావేశంలో కర్నాటకకు చెందిన కాంగ్రెస్ మంత్రులు, కేంద్రమంత్రులు శోభా కరణ్‌లాజే, భగవంత్ ఖూబా, ఎ.నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ షెఖావత్ సానుకూలంగా స్పందించారని, తమ రాష్ట్రానికి న్యాయం చేస్తామని హామీనిచ్చారని చెప్పారు. పూర్తి వివరాలను అందజేయాలని సూచించారని, సుప్రీంకోర్టు నిర్ణయం కోసం కేంద్రం వేచివుందని తెలిపారు. పక్క రాష్ట్రానికి నీటిని విడుదల చేయడాన్ని రైతులు, ఇతర సంఘాలు నిరసిస్తున్నట్లు కూడా కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. వర్షలోటు కారణంగా కర్నాటకలో నీటి కొరత నెలకొందని, తాగునీటితో పాటు నీటిపారుదల, పరిశ్రమల కోసం మరో 106 టీఎంసీల నీటి అవసరం రాష్ట్రానికి ఉందన్నారు. నాలుగు రిజర్వాయర్లలో కేవలం 51 టీఎంసీల నీరు ఉన్నట్లు డీకే శివకుమార్ తెలిపారు. రోజురోజుకూ ఇన్‌ఫ్లో తగ్గిపోతోందని, నీరు లేక ఖరీఫ్ పంటలను రాష్ట్రం కోల్పోయిందని, రబీ సాగుకూ క్లిష్టపరిస్థితులు నెలకొన్నాయని ఆయన చెప్పారు. సీడబ్ల్యూఎంఏ ఇంతకుముందు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఆచరించిందని ఉపముఖ్యమంత్రి తెలిపారు. తాజాగా అంటే ఈనెల 18న ఇచ్చిన ఉత్తర్వులను ఆచరించే పరిస్థితి లేదని చెప్పారు. అయితే నిత్యం నాలుగు వేల క్యూసెక్కులను పక్క రాష్ట్రానికి విడుదల చేస్తున్నామని అన్నారు. కరువు పరిస్థితి గురించి తెలిసినాగానీ ఈ అవకాశాన్ని మరిన్ని పంటలను పండించేందుకు తమిళనాడు వినియోగించుకుంటున్నట్లు ఉందని, ఆ విషయంలో జోక్యంచేసుకోవాలని తాము అనుకోవడం లేదని అన్నారు. కర్నాటక సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఉందని చెప్పారు. 123 ఏళ్లలో తొలిసారిగా ఆగస్టులో కనిష్ఠ వర్షపాతం నమోదైందని తెలిపారు. ఇలాంటి కష్టకాలంలో తమిళనాడుకు ఎంత నీరు ఇవ్వాలనేదానికి ఫార్ములా ఏమీ లేదని అన్నారు.

రాజీ ప్రసక్తే లేదు: తమిళనాడు ప్రభుత్వం

చెన్నై: కావేరి నీటికి సంబంధించి ఎలాంటి చర్చలు జరగడం లేదని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తమిళనాడు ప్రభుత్వం స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు తీర్పును అంగీకరిస్తామని తెలిపింది. కావేలి జలాల వాటాపై వెనక్కి తగ్గేదేలేదని ఆ రాష్ట్ర జల వనరుల మంత్రి దురైమురుగన్ తేల్చిచెప్పారు. ఇన్నేళ్లుగా జరిపిన మంతనాలు ఎలాంటి ఫలితాలివ్వలేదని నాలుగు రాష్ట్రాల జలవివాదంపై ప్రధాని జోక్యాన్ని కర్నాటక కోరడాన్ని ఉద్దేశించి అన్నారు. చివరకు కావేరి జల వివాదాల ట్రిబ్యునల్ (సీడబ్ల్యూఈడీటీ) వద్దకు రాక తప్పలేదన్నారు. ఈ వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం ఏం చెబిదే దానికి కట్టుబడతామని దురైమురుగన్ చెప్పారు. కాగా కావేరి జలాల విడుదల విషయంలో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది.

తక్షణమే జనగణన ప్రారంభించాలి

నితీశ్‌కుమార్ డిమాండ్

పాట్నా: జనగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మోదీ సర్కారును డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే జనాభా లెక్కలు ప్రారంభిస్తామని కేంద్రం చెప్పిన మరుసటి రోజే నితీశ్ ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. వాస్తవంగా 2021లోనే జనాభా లెక్కలు పూర్తి కావాల్సిందని, పదేళ్లకోసారి జరగాల్సిన జనగణన దేశంలో మొదటిసారి జాప్యం జరిగిందని జేడీయూ అధినేత చెప్పారు. 'జనగణన కోసం 2024 ఎన్నికల దాకా ఎందుకు వేచిచూడాలి. ఇప్పుడెందుకు చేపట్టకూడదు. పదేళ్లకోసారి జనాభా లెక్కలు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఈ ప్రక్రియను కేంద్రం ప్రారంభించాలి' అని నితీశ్‌కుమార్ ఇక్కడ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. జనగణనతో పాటు కుల గణన కూడా చేయాలని తాము డిమాండ్ చేస్తుండగా కేంద్రం అందుకు అందుకు అంగీకరించడం లేదని నితీశ్ చెప్పారు. చివరికి తామే సొంతంగా కుల గణన చేశామన్నారు. కుల ప్రాతిపదికన సర్వే చేయడం ద్వారా అందరికీ లబ్ధి చేకూరుతుందని సీఎం చెప్పారు. అణగారిన వర్గాలతో పాటు సమాజంలోని అందరి అభివృద్ధికి కృషి చేయవచ్చని తెలిపారు. ఈ సర్వే కారణంగా ఏ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయవచ్చో కూడా తెలుస్తుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పందిస్తూ లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందిందని, అయితే, దీని అమలు సంగతేంటని నితీశ్ ప్రశ్నించారు. మహిళల రిజర్వేషన్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంత త్వరగా అమలు చేస్తే అంత మంచిదని వ్యాఖ్యానించారు. మహిళల రిజర్వేషన్లకు తాను ఎప్పుడూ మద్దతిచ్చానని, మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు తమ ప్రభుత్వం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించేలా నిబంధనలు ఉండాలని సూచించారు.

చంద్రయాన్‌కు మతం రంగు వద్దు: రాజా

న్యూఢిల్లీ: చంద్రయాన్ మిషన్‌కు అశాస్త్రీయ రంగు పులమవద్దని డీఎంకే ఎంపీ ఎ.రాజా మోదీ సర్కారుకు హితవు పలికారు. దేశంలో పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక రంగంపై సమాజంలో చులకనభావం తీసుకురావద్దని పేర్కొన్నారు. చంద్రయాన్-3 విజయంపై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో రాజా పాల్గొన్నారు. ప్రపంచంలోని నాలుగు అగ్రరాజ్యాల్లో భారత్ ఒకటిగా విరాజిల్లుతోందని, అమెరికా, రష్యా, చైనా తర్వాత స్థానం భారత్‌దేనని రాజా చెప్పారు. 1950 వరకు భారత్ పరిస్థితి ఆశాజనకంగా లేదని గుర్తుచేశారు. అద్భుతమైన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం కారణంగానే చంద్రయాన్ మిషన్‌ను విజయవంతం చేసుకున్నామని, అంతేగానీ దైవత్వం కారణంగానే చంద్రయాన్‌ను సరైన కక్ష్యలోకి పంపామన్న భ్రమలు కల్పించవద్దని స్పష్టంచేశారు. 'చంద్రయాన్ విజయవంతానికి అశాస్త్రీయ రంగు పులమవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. అమెరికా, రష్యా, చైనా అలాంటి పనిచేయలేదు. దయచేసి చంద్రయాన్-3కి విక్రమ్ సారాభాయ్ పేరు పెట్టండి' అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాన్ని సమాజంలో తక్కువ చేసి చూపించవద్దని, శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేద్దామని తెలిపారు. 'ఓ పక్క చంద్రయాన్‌ను మీరు అంతరిక్షంలోకి పంపారు. మరోవైపు, మీ హృదయం, మెదడు చాలా తక్కువగా ఆలోచిస్తోంది. ఇది పరస్పర విరుద్ధం. చంద్రయాన్-3 విజయం ప్రధాని మోదీ ఓ పక్క ప్రశంసలు కురిపిస్తూ...మరోవైపు విశ్వకర్మ పథకం ప్రారంభించడం గర్వంగా ఉందని అంటారు' అని రాజా విమర్శించారు.

రాజస్తాన్ మంత్రిపై కేసు

జైపూర్: భిల్వాలా జిల్లాలో గ్రానైట్ గనులను అక్రమంగా ఆక్రమించుకున్నారన్న ఆరోపణలపై రాజస్తాన్ రెవెన్యూ మంత్రి రామ్‌లాల్ జాట్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు మంత్రిపై ఈ కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా కరేదా పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంత్రి, ఇతరులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సీఐడీ విచారణ చేస్తుందని డీఎస్పీ యోగేశ్ శర్మ తెలిపారు. మంత్రి ప్రమేయం ఉండటంతో కేసును సీఐడీ-సీబీ దర్యాప్తు చేస్తుందన్నారు. గనుల అక్రమ ఆక్రమణకు సంబంధించి పరమేశ్వర్ జోషి అనే వ్యక్తి ముందుగా స్థానిక కోర్టులో ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంతో జోషి హైకోర్టు తలుపుతట్టినట్లు పోలీసులు వివరించారు.

చైనాతో సరిహద్దు వివాదంపై చర్చకు సిద్ధం

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దు వివాదంపై చర్చించే ధైర్యం తమకు ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. చైనా నుంచి ఎదురవుతున్న సరిహద్దు సవాళ్లపై పార్లమెంటులో చర్చకు నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరాకరిరించడంపై ప్రతిపక్షాలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది. అంతరిక్ష రంగంలో భారత విజయాలపై రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో చర్చను ప్రారంభించగా కాంగ్రెస్ ఎంపీ అధీర్ రంజన్ చౌదరి కల్పించుకుని చైనాతో సరిహద్దు ప్రతిష్టంభనను ప్రస్తావించారు. అందుకు కేంద్రమంత్రి స్పందిస్తూ పై విధంగా అన్నారు. 'చంద్రయాన్-3' సహా భారత్ సాధించిన ఆయా అంతరిక్ష విజయాలపై రాజ్‌నాథ్ సింగ్ గురువారం లోక్‌సభలో చర్చను ప్రారంభించారు. దేశ సరిహద్దు భద్రత, దేశ సరిహద్దును రక్షించడంలో సైన్స్ పాత్రను ప్రస్తావించారు. ఈ సందర్భంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధీర్ రంజన్ చౌదరి జోక్యం చేసుకుంటూ చైనాతో సరిహద్దు వివాదాన్ని లేవనెత్తారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేశారు. దీనికి రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ "నాకు ధైర్యం ఉంది. చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను." అని స్పష్టం చేశారు. 2020లో గల్వాన్ ఘర్షణల అనంతరం భారత్, చైనా మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. రెండు దేశాల సైనిక అధికారుల మధ్య దశలవారీ చర్చలతో సరిహద్దులోని కొన్నిచోట్ల వివాదాలు పరిష్కారాలు జరిగాయి. అయితే, ఇప్పటికీ అయిదారు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ వెల్లడించారు.

తీవ్రవాదులకు అడ్డాగా కెనడా

భారత విదేశాంగ శాఖ ధ్వజం

న్యూఢిల్లీ: ఖలిస్థానీ అంశంపై కెనడా వ్యవహరిస్తున్న తీరును భారత్ మరోసారి తీవ్రంగా తప్పుపట్టింది. ఆ దేశం తీవ్రవాదులు, అతివాదులకు స్వర్గధామంగా మారిందని విమర్శించింది. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రికత్తలు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరీందమ్ బాగ్చి ఈ వ్యవహారంపై గురువారం మీడియాతో మాట్లాడారు. ఖలిస్థానీ సానుభూతిపరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉండొచ్చని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమేనని దుయ్యబట్టారు. ఇక, భద్రతాపరమైన పరిస్థితుల కారణంగానే కెనడియన్లకు వీసా సర్వీసులను నిలిపివేసినట్లు ధ్రువీకరించారు. "భారత్‌పై కెనడా చేసిన ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమేనని అనిపిస్తోంది. హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఘటన గురించి ఆ దేశం ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు. కానీ, కెనడా గడ్డపై జరుగుతున్న నేరపూరిత కార్యకలాపాలు, వ్యతిరేక శక్తులకు సంబంధించి అన్ని ఆధారాలను ఆ దేశానికి ఇచ్చాం. గత కొన్నేళ్లుగా దాదాపు 20-25 మంది వ్యక్తులను మన దేశానికి అప్పగించాలని కెనడాను కోరాం. అయితే, అటు వైపు నుంచి ఎలాంటి స్పందనా లేదు. మన డిమాండ్లపై కెనడా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఆ దేశం వ్యవస్థీకృత నేరాలకు అడ్డాగా మారుతోంది.

ఎల్గార్ పరిషత్ కేసులో మహేశ్ రౌత్‌కు బెయిల్

ముంబై: ఎల్గార్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసు నిందితుడు 33 ఏళ్ల హక్కుల కార్యకర్త మహేశ్ రౌత్‌కు బోంబే హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మహేశ్ రౌత్‌కు వ్యతిరేకంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఎలాంటి ఆధారాలు చూపలేకపోయిందని హైకోర్టు పేర్కొంది. మహేశ్ రౌత్ సీపీఐ(మావోయిస్టు) సభ్యుడని చెప్పినప్పటికీ అతను కోవర్టు అని గానీ లేక ఉగ్రవాద చర్యలకు పాల్పడినట్లు ఎన్ఐఏ నిరూపించలేకపోయిందని తెలిపింది. అదేసమయంలో మావోయిస్టు పార్టీలోకి యువతను పంపిస్తున్నాడన్న ఆరోపణలను రుజువు చేయలేదని జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ షర్మిల దేశ్‌ముఖ్‌తో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ధర్మాసనం తీర్పు వెలువరించిన తర్వాత...దీనిపై రెండు వారాలు స్టే ఇవ్వాలని ఎన్ఐఏ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందేశ్ పాటిల్ కోరారు. అయితే, వారం రోజులు స్టే ఇవ్వడానికి ధర్మాసనం అంగీకరించింది. రౌత్‌ను 2018లో అరెస్టు చేశారు. ఆయన ముంబై శివారులోని తలోజ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నాడు. ఈ కేసులో సామాజిక కార్యకర్త ఆనంద్ తేల్తుంబ్డే, న్యాయవాది సుధా భరద్వాజ్, వెర్నన్ గోన్‌సాల్వేస్, అరుణ్ ఫెరీరా రెగ్యులర్ బెయిల్‌పై బయట ఉండగా కవి వరవరరావు ఆరోగ్య కారణాలతో బెయిల్‌పై ఉన్నారు. మరో నిందితుడు గౌతం నవలఖ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గృహనిర్బంధంలో ఉన్నారు.

జ్యోతి బెయిల్‌పై సుప్రీం విచారణ వాయిదా

ఎల్గార్ పరిషత్ కేసులో హక్కుల కార్యకర్త జ్యోతి జగతప్ బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. తనకు బెయిల్ నిరాకరిస్తూ బోంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ జ్యోతి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఎన్ఐఏ సమర్పించిన ప్రాథమిక ఆధారాలు సక్రమంగానే ఉన్నాయని పేర్కొంటూ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. మావోయిస్టు పార్టీతో కలిసి భారీ కుట్రకు పాల్పడినట్లు ఎన్ఐఏ ఆరోపించింది. ఎన్ఐఏ అఫిడవిట్‌కు రీజాయిండర్ దాఖలు చేయడానికి గడువు కావాలంటూ జ్యోతి తరపు న్యాయవాది అపర్ణ భట్ కోరడంతో బెయిల్‌పై విచారణను వాయిదా వేసింది.

రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ ఆవిష్కరణ

300 రకాల సైన్స్ అవార్డులకు కేంద్రం స్వస్తి

న్యూఢిల్లీ: సైన్స్ విభాగాలిచ్చే 300 వేర్వేరు పురస్కారాలకు స్వస్తి పలికి శాస్త్రీయ, సాంకేతిక, ఆవిష్కరణల విభాగంలో కొత్తగా జాతీయస్థాయి అత్యున్నత పురస్కారంగా 'రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్'ను కేంద్రప్రభుత్వం ఆవిష్కరించింది. ఈ పురస్కారాన్ని మొత్తం నాలుగు విభాగాల్లో 'విజ్ఞాన్ రత్న, విజ్ఞాన్ శ్రీ, విజ్ఞాన్ యువ-శాతం స్వరూప్ భట్నాగర్, విజ్ఞాన్ టీమ్'గా అందజేస్తారు. కేంద్రప్రభుత్వానికి ముఖ్య శాస్త్రీయ సలహాదారు నేతృత్వ కమిటీ 13 విభాగాల్లో అర్హులైన శాస్త్రవేత్తలను ఎంపిక చేస్తుంది. భారతీయులకు, సమాజానికి అసాధారణ తోడ్పాటు అందించి... విదేశాల్లో ఉండే భారత సంతతి వ్యక్తులూ ఈ పురస్కారానికి అర్హులు అని గురువారం వెలువడిన అధికారిక ప్రకటన పేర్కొంది. జీవితసాఫల్య పురస్కారంగా విజ్ఞాన్ రత్నను, గణనీయమైన తోడ్పాటుకు నిదర్శనంగా విజ్ఞాన శ్రీని అందజేస్తారని తెలిపింది. అన్ని అవార్డుల రూపేణ ప్రశంసా పత్రం, పతకాన్ని బహూకరిస్తారని పేర్కొంది. 1958 నుంచి శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన మండలి అందిస్తున్న శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులను ఏడు విభాగాల నుంచి 13 విభాగాలకు విస్తరించారు. యువ శాస్త్రవేత్తల (45ఏళ్ల లోపు)కు దీనిని అందజేస్తారు. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది శాస్త్రవేత్తలు/పరిశోధకులు/ఆవిష్కర్తల బందానికి విజ్ఞాన్ టీమ్‌తో సత్కరిస్తారు.

శాస్త్రీయ సాంకేతిక రంగంలోనే కాకుండా గొప్ప ఆవిష్కరణలకూ రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కార్ వరిస్తుందని ప్రకటన తెలిపింది. ఏటా జనవరి 14 నుంచి ఫిబ్రవరి 28 వరకు నామినేషన్లను ఆహ్వానిస్తారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మే 11న పురస్కారాలను ప్రకటిస్తారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఆగస్టు 23న అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని వెల్లడించింది.

సామాన్యుడి కంట మళ్లీ కన్నీరు!

భారీగా పెరగనున్న ఉల్లి ధర

కేంద్రం నిర్ణయమే కారణమా !

నాసిక్: రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా ఉల్లిపాయల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో తీవ్ర సంక్షోభం ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయి. మార్కెట్లో ఉల్లి సరఫరా తగ్గి ధరలు కొండెక్కే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉల్లిపాయలు అధికంగా సరఫరా అయ్యే నాసిక్‌లో వేలం పాటలు తిరిగి నిలిచిపోవడంతో ఉల్లి సంక్షోభం ఏర్పడే ప్రమాదముంది. ఉల్లిపాయల ఎగుమతులపై సుంకాన్ని 40 శాతం పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నాసిక్ ఉల్లిగడ్డ వ్యాపారులు వేలం నిలిపివేస్తున్నట్టు తాజాగా బుధవారం ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. నాసిక్ జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో వేలం నిలిపివేస్తున్నామని, తమ ఆందోళనలు నిరవధికంగా కొనసాగుతాయని నాసిక్ డిస్ట్రిక్ట్ ఆనియన్ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీఓటీఏ) తెలిపింది. కేంద్రం నిర్ణయం వల్ల అటు ఉల్లిగడ్డ ఎగుమతిదారులే కాక రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారని ఎన్డీఓటీఏ ఆందోళన వ్యక్తంచేసింది. సుంకం పెంపు నిర్ణయం ఉపసంహరించుకునే వరకు జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీలలో వేలాన్ని నిరవధికంగా నిలిపివేస్తున్నట్టు అసోసియేషన్ స్పష్టం చేసింది. ఆందోళన చేసే వ్యాపారుపై తగు చర్యలు తీసుకుంటామని మహారాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అబ్దుల్ సత్తార్ హెచ్చరించారు. వ్యాపారుల నిర్ణయం సరైంది కాదని పేర్కొన్న ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనకు దిగుతున్న వ్యాపారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని నాసిక్ కలెక్టర్‌ను ఆదేశించారు.

త్రీ ఇడియట్స్ నటుడు అఖిల్ మిశ్రా మృతి



ముంబై: చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు, త్రీ ఇడియట్స్ నటుడు అఖిల్ మిశ్రా(58) కన్నుమూశారు. గురువారం బాల్కనీలో ఏదో పని చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తూ అక్కడి నుంచి కిందపడటంతో అక్కడికక్కడే మరణించారు. నటుడి మరణంతో ఆయన భార్య సుజానే కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. 'నా భాగస్వామి నన్ను వదిలేసి వెళ్లిపోయాడు, నా గుండె ముక్కలైంది' అని కన్నీటిపర్యంతమవుతున్నారు. కాగా అఖిల్ మిశ్రా.. డాన్, వెల్‌డన్ అబ్బా, హజారన్ ఖ్వైషేస్ ఐసీ వంటి చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. త్రీ ఇడియట్స్ సినిమాలో లైబ్రేరియన్‌గా నటించి ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. సినిమాలే కాకుండా సీరియల్స్, టీవీ షోలు కూడా చేశారు. 1983లో ఆయన తన సహనటి మంజు మిశ్రాను పెళ్లి చేసుకున్నారు. ఆయనను ఒంటరి చేస్తూ 1996లో ఆమె మరణించారు. దీంతో 2009లో జర్మన్ నటి సుజానే బెర్నర్ట్‌ను వివాహమాడారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే

- మహిళా బిల్లుపై సీపీఐ ఎంపీలు వినయ్ విశ్వం, సంతోశ్ కుమార్ విమర్శ
- వచ్చే ఎన్నికల్లో అమలుకు డిమాండ్

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లును ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని సీపీఐ ఎంపీలు వినయ్ విశ్వం, పి.సంతోశ్ కుమార్ విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ఒక్క మహిళకూ స్థానం లేదన్న విషయం అందికీ తెలుసు అని విశ్వం అన్నారు. బీజేపీ కూడా ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ రాజకీయ సంస్థ అని మరువరాదన్నారు. 2024 ఎన్నికల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణన, పునర్విభజన వంటి అడ్డంకులు అన్నింటిని తొలగించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. రాజ్యసభతో పాటు అన్ని శాసన మండళ్లకూ రిజర్వేషన్ విస్తరించేలా చూడాలన్నారు. ఓబీసీలు, మైనారిటీల హక్కులను పరిరక్షించాలని కోరారు. ప్రస్తుత, భవిష్యత్ చట్టసభల్లో వారికి సముచిత న్యాయమైన వాటా అందేలా చర్యలు ఉండాలని ప్రభుత్వానికి సూచిం చారు. 2024 ఎన్నికల్లో ఈ బిల్లు అమలుకు వచ్చే సమస్య ఏమిటిని, దీనికి జనగణన, పునర్విభజనతో ముడి పెట్టడం ఎందుకని సంతోశ్ కుమార్ ప్రశ్నించారు. బేషరతుగా రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేశారు. గీతా ముఖర్జీ వంటి సీపీఐ నాయకులు దీర్ఘకాలం పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాటం చేశారని ఎంపీలు గుర్తుచేశారు. వారిలాంటి అనేక మంది మహిళా నాయకుల పోరాట ఫలితంగానే నేడు మహిళా బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగలిగిందని తెలిపారు. త్వరలోనే చట్టం కాబోతోందని చెప్పారు. మహిళా బిల్లుకు సీపీఐ మద్దతు ఇస్తుందని ఎంపీలు ప్రకటించారు. అయితే పెద్దనోట్ల రద్దు, అధికరణ 370 రద్దు, లాక్‌డౌన్ ప్రకటన వంటివన్నీ కొన్ని గంటల వ్యవధిలో అమలు జరుగగా మహిళా రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లో అమలు చేయడం ఎందుకు కుదరదని కేంద్రాన్ని ప్రశ్నించారు. మహిళా సాధికారత గురించి ప్రగల్భాలు పలుకుతూ, బిల్లును తేవడం పార్లమెంటు చరిత్రలోనే స్వర్ణ అధాయంగా గొప్పలు పోయే వారు రిజర్వేషన్ల అమలు విషయంలో ఎందుకని చిత్తశుద్ధి చూపడం లేదని నిలదీశారు. ఏవో కారణాలు చూపుతూ జాప్యం చేయడం ఎందుకని ఎంపీలు ప్రశ్నించారు. జనగణన, పునర్విభజన అంటూ అడ్డంకులు పెట్టకుండా ఈ బిల్లు అమలుకు మార్గం సుగమం చేయాలని కేంద్రాన్ని వినయ్ విశ్వం, సంతోశ్ కుమార్ కోరారు.

2034కి అమలు చేసినా అద్భుతమే

మహిళా బిల్లుపై సీతారాం ఏచూరి

పాట్నా: పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టంచేశారు. రిజర్వేషన్ల కోసం మహి ళలు 25 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ రిజర్వేషన్లను 2034 నాటికి అమలు చేసినా అద్భుతమే అవుతుందని వ్యాఖ్యానించారు. సీపీఎం రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో పాల్గొనేందుకు ఇక్కడకు వచ్చిన సీతారాం ఏచూరి కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. 'మహిళా బిల్లు గతంలో రాజ్యసభ ముందుకు వచ్చినప్పుడు ఎస్‌సీ, ఎస్‌టీ, ఓబీసీకు ప్రత్యేక కోటా ఉండాలన్న అంశం తెరపైకి వచ్చింది. ఈ అంశాలను ఇప్పుడు బిల్లులో పట్టించుకోలేదు. ఈ అంశా లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది' అని ఏచూరి విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. 'మహిళల రిజర్వేషన్ల కోసం దేశం 25 ఏళ్లుగా ఎదురుచూస్తోంది. ఈ బిల్లు అమలు కావడానికి జనగణన, నియోజక వర్గాల పునర్విభజన పూర్తికావాలని అంటున్నారు. ఇదంతా జరిగి 2034 నాటికి రిజర్వేషన్లు అమలులోకి వస్తే అద్భుతమే అవుతుంది. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలి' అని ఏచూరి అన్నారు. ఇక్కడ నుంచి తిరిగి వెళ్లడానికి ముందు ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, ఆర్‌జేడీ అధినేత లాలు ప్రసాద్‌తో సమావేశమవుతానని, వారిద్దరూ ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వాములని ఏచూరి చెప్పారు.

తొమ్మిదన్నరేళ్లు ఎందుకు?

కాంగ్రెస్ ఎంపీ రంజిత్ రంజన్ ప్రశ్న

న్యూఢిల్లీ: పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్స వానికి రాష్ట్రపతి, అత్యున్నత పదవిని అధిష్టిం చిన తొలి గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును ఎందుకు ఆహ్వానించలేదని రాజ్యసభలో కాంగ్రెస్ నేత రంజీత్ రంజన్ ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగం (128వ సవరణ) బిల్లు, 2023పై రాజ్యసభలో చర్చను రంజన్ ప్రారంభించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో హామీనిచ్చినప్పటికీ ఈ బిల్లు తేవడానికి బీజేపీకి తొమ్మిదిన్నరేళ్లు ఎందుకు పట్టిందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును యూపీఏ ప్రభుత్వం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. సాధారణ సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించే అవకాశమున్నప్పుడు ప్రత్యేక సమావేశం ఎందుకని ప్రశ్నించారు. అందరి దృష్టిని ఆకర్షించడం బీజేపీకి పరిపాటిగా మారిందాని రంజన్ ఎద్దేవా చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం మహిళలను వినియోగించే యోచనలో ఆ పార్టీ ఉందన్నారు. నోట్లరద్దు, మూడు సాగు చట్టాలు వంటి అనేక కీలక నిర్ణయాలను ఎవరితో సంప్రదింపులు జరప కుండా ఏకపక్షంగా తీసుకున్నట్లు గుర్తుచేశారు. బీజేపీ ఎంపీకి వ్యతిరేకంగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేసినప్పుడు ప్రభుత్వం తరపున ఎవ్వరూ స్పందించలేదని రంజన్ తెలిపారు.

సమాధానం చెప్పలేకే సస్పెన్షన్

- అచ్చెన్నాయుడు ఆగ్రహం
- మంత్రి మా వృత్తిని అవమానించారు: బాలకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: మా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపితే, ఆయనకు జరిగిన అన్యాయంపై మేం అసెంబ్లీలో మాట్లాడకూడదా? అని టీడీపీ ఏపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. టీడీపీ సభ్యుల సస్పెన్షన్ అనంతరం అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్ని తొలగించాలని, ఆయన్ని వెంటనే విడుదల చేయాలని శాసనసభ సాక్షిగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్న డిమాండ్లతో టీడీపీ సభ్యులందరం సభకు వెళామనీ, శాసనసభ సాక్షిగా ప్రజలకు తప్పుడు సమాచారం ఇవ్వాలని స్పీకరే ప్రయత్నించారని చెప్పారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తికి అధికారపార్టీ శాసనసభ్యుల వెకిలి చేష్టలు, వెర్రి మొర్రి వేషా లు కనిపించలేదు. సభ్య సమాజం తలదించుకునేలా వారు మాట్లాడిన మాటలు ఆయనకు వినిపించలేదు. సాక్షాత్తూ రాష్ట్రమంత్రిగా ఉన్న వ్యక్తి కావాలనే తొడగొట్టి మీసం మెలెస్తే, దానికి ప్రతిగా మా పార్టీ సభ్యులు నందమూరి బాలకృష్ణ స్పందించారు. అంతేగానీ ఆయన ఎక్కడా అనుచితంగా, హద్దులుమీరి ప్రవర్తించలేదు. మా సభ్యులు ఏం తప్పుచేశారని శాసనసభ నుంచి సస్పెండ్ చేశారో ప్రభుత్వమే చెప్పాన్నారు. మేం 17 మంది ఉంటే, మాకు సమాధానం చెప్పే ధైర్యంలేక ఈ ప్రభుత్వం 200 మంది మార్షల్స్‌ను పెట్టి సభ నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి మమ్మల్ని రెచ్చగొడితే ఆయనపై ఎలాంటి చర్యలు లేవు.. కొందరు అధికారపార్టీ ఎమ్మెల్యేలు మమ్మల్ని బూతులు తిట్టినా స్పీకర్ పట్టించుకోలేదు. వారిని ఏమీ అనే ధైర్యంలేక, మమ్మల్ని తప్పుపట్టి, బయటకు పంపించారని అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

మంత్రి నా వృత్తిని అవమానించాకే స్పందించా: బాలకృష్ణ

మంత్రి అంబటి రాంబాబు నాకు వేలు చూపించి మీసం మెలేసి ఇది సినిమా కాదంటూ తొడకొట్టాడు. నటన నా వృత్తి. దాన్ని అవమానించార. ఆయన అతిగా స్పందించాకే నేను మీసం తిప్పి తొడకొట్టాను. వీళ్ల భయపెడితే భయపడేవాళ్లం కాదు. ఎంతదూరమైనా వెళ్తాం. ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటాం. నేను హుందాగా ఉంటాను కాబట్టి ఏంచేసినా మాట్లాడకుండా ఉంటాననుకున్నారు. నేను స్పందించాక, వాళ్లకు మతిపోయినంత పనైంది. చంద్రబాబును జైలుకు పంపడంపై సినీ పరిశ్రమలో ఎవరి అభిప్రాయాలు వాళ్లవి. నాలాగా అందరూ ధైర్యంగా మాట్లాడలేరని బాలకృష్ణ అన్నారు.

వైసీపీ పుట్టిందే ములాఖత్‌లు... మిలాఖత్ నుంచి: పయ్యావుల కేశవ్

చంద్రబాబునాయుడిని పవన్ కల్యాణ్ కలిస్తే దానిపై ముఖ్యమంత్రి ములాఖత్‌లో మిలాఖత్ అయ్యారని మాట్లాడారు. జగన్ చంచల్ గూడ జైల్లో ఉన్నప్పుడు ఎన్ని మిలాఖత్‌లు అయ్యాయి. వైసీపీ పుట్టుక మొదలైందే ములాఖత్‌లు. మిలాఖత్ లతో కదా! ఆ విషయం మర్చిపోయి మాట్లాడితే ఎలా? అని పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. ఆయనపై ఉన్న కేసుల విచారణ ఆగిపోవ డానికి ఏ మిలాఖత్‌లు కారణమో ఆయనే చెప్పాలన్నారు. అధికారపార్టీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీకి, బహిరంగసభకు తేడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి బయటకు రావాలంటే 144 వ సెక్షన్. 30 యాక్ట్ తప్పనిసరి అయిందని, చివరకు అసెంబ్లీలో కూడా అదే పరిస్థితి నెలకొందని రామానాయుడు విమర్శించారు.

ఇకపై వైద్య విద్యార్థులకు విదేశాల్లో పీజీ, ప్రాక్టీసుకు అవకాశం

ఎన్‌ఎంసీకి డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు

న్యూఢిల్లీ: భారత వైద్య పట్టభద్రులకు తీపి కబురు అందింది. ఇకపై అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసేందుకు మార్గం సుగమమైంది. జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ)కి వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూఎఫ్ఎంఈ) గుర్తింపు లభించడంతో విదేశాల్లో వైద్య సేవలు అందించే అవకాశం భారత వైద్యులను వరించబోతోంది. ప్రస్తుతం ఉన్న 706 మెడికల్ కాలేజీలతో పాటు వచ్చే పదేళ్లలో ఏర్పాటయ్యే వైద్య కళాశాలలన్నీ డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు పొందుతా యని కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం ప్రకటించింది. దీంతో భారతీయ వైద్య విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా ప్రాక్టీసు చేసుకోవచ్చని ఎన్‌ఎంసీకి చెందిన ఎథిక్స్&మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డ్ సభ్యుడు డాక్టర్ యోగేంద్ర మలిక్ అన్నారు. అంతర్జాతీయ విద్యార్థులను భారత వైద్య కళాశాలలు ఆకర్షిస్తాయని ఆకాంక్షించారు. డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు పొందినట్లు అధికారిక లేఖ, గుర్తింపు పత్రం ఎన్‌ఎంసీకి అందనున్నట్లు అధికారులు తెలిపారు. భారత వైద్య కళాశాలు, నిపుణులకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది.. విదేశాల్లోని మెడికల్ విద్యా సంస్థలు, భారత్‌లోని కాలేజీల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి.. వైద్య విద్యలో సరికొత్త ఆవిష్కరణలకు ఇది సహకరిస్తుంది.. భారత్‌లో అందించే వైద్య విద్య అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందనేందుకు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ గుర్తింపే నిదర్శనమని ఆరోగ్యశాఖ వెల్లడించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య విద్యను అందించేందుకు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ కృషి చేస్తోంది. వైద్య విద్యలో ఆధునిక సాంకేతిక, నైతిక ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందజేయడానికి తోడ్పడుతుందని ఆరోగ్యశాఖ ప్రకటన తెలిపింది.

మణిపూర్‌లో ఆగని హింస

ఇంఫాల్: జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన ఐదుగురు యువకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పోలీస్‌స్టేషన్‌ల ముట్టడికి యత్నించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ఈ క్రమంలో దాదాపు 10 మందికి పైగా గాయపడ్డారు. పరిస్థితులు మరింత దిగజారకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు తూర్పు, పశ్చిమ ఇంఫాల్ జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపులను రద్దు చేశారు. అధునాతన ఆయుధాలు, భద్రతా బలగాల యూనిఫాంతో తిరుగుతున్న ఐదుగురు యువకులను సెప్టెంబరు 16న మణిపూర్ పోలీసులు అరెస్టు చేశారు. వారిని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, పోలీసు కస్టడీకి తరలించారు. ఆ అరెస్టుతో స్థానికంగా నిరసనలు మొదలయ్యాయి. నిందితులను విడిచిపెట్టాలంటూ మంగళవారం నుంచి 48 గంటల లాక్‌డౌన్ పాటించారు. ఈ క్రమంలోనే ఆయా సంఘాల పిలుపుతో గురువారం మహిళలు సహా వందలాది మంది నిరసనకారులు తూర్పు, పశ్చిమ ఇంఫాల్ జిల్లాల్లోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో ప్రవేశించేందుకు యత్నించారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది బాష్పవాయువు ప్రయోగించారు. దాంతో 10 మందికిపైగా గాయాలయ్యాయి.

తక్షణమే భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై డిమాండ్

విశాలాంధ్ర–విజయవాడ (చిట్టినగర్): యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం తీసుకురావాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుమలై మాట్లాడారు. నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని తిరుమలై విమర్శించారు.

ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ... అధికారం చేపట్టిన తర్వాత ఆ ఊసే లేదని మండిపడ్డారు. దీనికిబదులు ప్రభుత్వ రంగసంస్థలు ఎల్‌ఐసీ, రైల్వే, బొగ్గు, బ్యాంకులను అమ్మేస్తున్నారని, అంబానీ, ఆదానీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంటే...మత ఘర్షణలు, ప్రాంతీయ విభేదాలు సృష్టించి మోదీ సర్కారు పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీపై శ్వేతపత్రం విడుదల చేయాలని జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను నిరుద్యోగ రాష్ట్రంగా జగన్ ప్రభుత్వం మార్చివేసిందన్నారు. నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో చర్చించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్...అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా ఉద్యోగ నోటిఫికేషన్‌లే విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, శాంతియుత ఉద్యమాలను సైతం అణిచివేస్తున్నారని చెప్పారు. ఖాళీ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, సహాయ కార్యదర్శి కత్తి రవి, విజయవాడ నగర కార్యదర్శి లంక గోవిందరాజులు, నాసర్ జి, నగర నాయకులు లంకె సాయి, గుంజా క్రాంతి, మోహన్ ప్రసాద్, గాడి అజయ్, మనోజ్, వినోద్, సుభాశ్ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం, గవర్నరు అడ్డంకి

- ఎల్‌డీఎఫ్ కన్వీనర్ జయరాజన్ విమర్శ
- రాజ్‌భవన్ వద్ద వామపక్ష నేతల నిరసన

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, బిల్లులపై గవర్నరు సంతకాలు చేయకపోవడంపై కేరళలోని అధికార ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజ్‌భవన్ వద్ద గురువారం నిరసనకు దిగింది. రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి కేంద్రం విధానాలు ఆటంకంగా ఉన్నాయని విమర్శించింది. అసెంబ్లీ ఆమోదం పొంది నెలలు గడుస్తున్నా కీలక బిల్లులకు గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ సంతకాలు చేయడం లేదని మండిపడింది. ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ మాట్లాడుతూ మోదీ సర్కారు కేరళను ఆర్థికంగా నియంత్రిస్తోందని విమర్శించారు. బీజేపీ చెప్పుచేతల్లో నడుస్తున్న గవర్నరు నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, సుదీర్ఘ చర్చల తర్వాత అసెంబ్లీ ఆమోదం పొందిన అనేక ముఖ్యమైన బిల్లులను గవర్నరు తొక్కి పెట్టారని జయరాజన్ ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్‌పైనా ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభు త్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు యూడీఎఫ్ ఏమాత్రం మద్దతివ్వడం లేదని చెప్పారు. నిజం చెప్పాలంటే అభివృద్ధి పనులకు యూడీఎఫ్ అడుగడుగునా అడ్డుపడుతోందని నిందించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందని జయరాజన్ చెప్పారు. రాష్ట్ర పురోభివృద్ధి కోసం లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు బీజేపీ, యూడీఎఫ్ భయపడుతున్నాయని తెలిపారు. కొన్ని అంశాలలో రెండు పార్టీలు ఒకేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేరళ అభివృద్ధిని అడ్డుకోవడంలో రెండు పార్టీలు ఒకే వైఖరి అవలంబిస్తున్నట్లు తెలిపారు. కేరళ రాజ్‌భవన్ వద్ద జరిగిన నిరసనలో వందలాదిమంది పాల్గొన్నారు. ఎల్‌డీఎఫ్ రాష్ట్ర నాయకులు, తిరువనంతపురం జిల్లా ప్రజాప్రతినిధులు ఆందోళనలో భాగస్వాముల య్యారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ కృషి కారణంగానే వందేభారత్ రైలు, రాష్ట్రంలో విళింజన్ సీ పోర్టు నిర్మాణం కొనసాగుతున్నాయని జయరాజన్ వివరించారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక బిల్లులు గవర్నరు వద్ద సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బిల్లులకు సమ్మతి తెలపడానికి గవ ర్నరు నిరాకరిస్తున్నారని విమర్శించారు.

పార్లమెంటు చరిత్రలో సువర్ణాధ్యాయం: మోదీ

న్యూఢిల్లీ: మహిళా బిల్లుకు లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలుపడమన్నది భారత పార్లమెంటు చరిత్రలో స్వర్ణాధ్యాయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇది మరువలేని క్షణమని చెప్పారు. నారీశక్తి వందన్ అభినియం బిల్లుకు ఆమోదం లభించడం గొప్ప విజయమని గురువారం లోక్‌సభలో మోదీ ప్రశంసించారు. ఇందుకు ఘనత అన్ని రాజకీయ పార్టీలు, సభ్యులకు దక్కుతుందన్నారు. 'ఇది పవిత్ర కార్యం. మద్దతిచ్చిన అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నా' అని అన్నారు. చర్చలు అర్థవంతంగా జరిగాయని చెప్పారు. దేశాన్ని కొత్త శిఖరాలకు చేర్చే అనూహ్యమైన శక్తి సృష్టికి, మాతృశక్తికి చోదకశక్తిగా ఇది పరిణమిస్తుందని మోదీ ఆకాంక్షించారు.

క్రీడా వసతులకు రూ.30 కోట్లు

రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ ప్రారంభించిన శ్రీనివాసుల రెడ్డి

విశాలాంధ్ర–విజయవాడ స్పోర్ట్స్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతిస్తోందని, అన్ని జిల్లాల్లోని పాఠశాలలకు క్రీడా మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందని సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏఎస్‌పీడీ) డాక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఇప్పటికే 12 జిల్లాలకు క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించామని, మిగిలిన 14 జిల్లాలకు త్వరలోఅందించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్వర్యంలో 67వ అంతర్ జిల్లాల అండర్-14, 17 బాలబాలికల రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ టోర్నీని డాక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి, ఎస్‌జీఎఫ్ఏపీ సెక్రటరీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ జి.భానుమూర్తి రాజు, విజయవాడ రూరల్ మండల జేడీటీసీ కె.సువర్ణరాజు ప్రారంభించారు. పాత 13 జిల్లాల నుంచి 650 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యలో భాగమైన క్రీడలు, ఆటలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలు నిర్వహించనుందని తెలిపారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తే ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు, ప్రభుత్వ శాఖల్లో ఉపాధి పొందడంలో అదనపు రిజర్వేషన్ సౌకర్యాలు లభిస్తాయన్నారు. భానుమూర్తి రాజు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రస్థాయి ప్రథమ ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అక్టోబర్ 3 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ నేషనల్స్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. నున్న జడ్‌పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా విజయవాడ రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యార్కారెడ్డి నాగిరెడ్డి, పోలరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మహబూబ్ భాషా, ఆర్.రెడ్డి, తోట అజయ్, నరెడ్ల సత్యనారాయణరెడ్డి, సూరిబాబు, వల్లూరి వెంకట శివ, టి.విజయవర్మ, టి.శ్రీలత పాల్గొన్నారు.

తమిళనాడులోని తిరుపూర్‌లో జరుగుతున్న ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశంలో నివేదిక ఇస్తున్న అమర్‌జిత్ కౌర్. హాజరైనవారిలో ఒక భాగం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, అధ్యక్షులు రవీంద్రనాథ్, నాయకులు వెంకట సుబ్బయ్య, కొండలరావు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.